


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 337, పేజీలు - 08

బుధవారం, మే 27, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




# కేటీఆర్ ముఖ్యమంత్రి అభ్యర్థి.?

## - గులాబీ పార్టీలో ప్రచారం!

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) వచ్చే ఎన్నికలకు కేటీఆర్ ముఖ్యమంత్రి అభ్యర్థి అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. పార్టీలో జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే అదే అనిపిస్తుంది. కేసీఆర్ కుటుంబంలో తలెత్తిన విభేదాలతో కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు గులాబీ పార్టీలో పెద్దయెత్తున ప్రచారం జరుగుతుంది. ఇప్పటికే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా కేటీఆర్ కు కేసీఆర్ ఎప్పుడో పదోన్నతి కల్పించారు. ఇక పార్టీ విషయాలను కూడా కేటీఆర్ దగ్గరుండి చూసుకుంటున్నారు. ఈ సమయంలో వచ్చే ఎన్నికలకు సంబంధించి కేసీఆర్ ఒక క్లారిటీకి వచ్చారని సమాచారం. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే కేటీఆర్ కు ముఖ్యమంత్రి పదవి అప్పగించాలని నిర్ణయించినట్లు ప్రచారం జరుగుతుంది. మరింత ఆలస్యం చేస్తే కుటుంబ విభేదాలు రోడ్డున పడే అవకాశాలున్నాయని కేసీఆర్ భావిస్తున్నారు.

### కుటుంబ వివాదాల నేపథ్యంలో..

ఈ సమాచారం అందిన తర్వాత మాత్రమే కల్వకుంట్ల కవిత తాను పార్టీ నుంచి బయటకు వెళ్లేందుకు లేఖలు రాసి సస్పెండ్ అయ్యేలా చేసుకున్నారని, తర్వాత ఆమె కొత్త పార్టీ పెట్టుకుని తన దారి తాను చూసుకున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన నేతగా ఇప్పటికీ పేరుంది. 2014 నుంచి 2018 వరకూ ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఉన్నారు. మరోసారి ముఖ్యమంత్రి అవ్వాలన్న యోచనలో కేసీఆర్ లేడని తెలిసింది. ఇప్పటి వరకూ తన వారసత్వాన్ని కేటీఆర్ కు అప్పగించాలని డిసైడ్ అయ్యారని, అందుకే పూర్తి స్వేచ్ఛను కేటీఆర్ కు ఇచ్చారన్నది గులాబీ నేతల అభిప్రాయం.

2లో..



# మమతా బెనర్జీకి కోలుకోలేని షాక్

## - బీజేపీలో విలీనానికి లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు రెడీ




కోల్కతా (ప్రశ్న న్యూస్) బెంగాల్ శాసనసభ ఎన్నికలు 2026లో తృణమూల్ కాంగ్రెస్ ఘోర పరాజయం ఆ పార్టీ పునాదులను కదిలిస్తోంది. సుమారు 15 ఏళ్ల అధికారానికి తెరపడుతూ బీజేపీ ఘనవిజయం సాధించడంతో, ఇప్పుడు టీఎంసీ అంతర్గత సంక్షోభంలో కూరుకుపోయింది. ఈ క్రమంలో లోక్‌సభలో ఆ పార్టీకి ఉన్న బలం కూడా సడలిపోయే సూచనలు కనిపిస్తున్నాయి. దాదాపు 12 మంది లోక్‌సభ ఎంపీలు ఇప్పటికే బీజేపీతో టచ్‌లోకి వెళ్లినట్లు బెంగాల్‌లో రాజకీయవర్గాలు అంచనాకు వచ్చాయి.

టీఎంసీకి చెందిన 29 మంది లోక్‌సభ సభ్యుల్లో దాదాపు 12 మంది ఎంపీలు ఇప్పటికే కమలం గూటికి చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. మరో ఐదారుగురు ఎంపీలతో కూడా చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. మొత్తం మీద 19 నుంచి 20 మంది ఎంపీలను ఒకే తాటిపైకి తెచ్చి, ఫిరాయింపుల నిరోధక చట్టం నుంచి రక్షణ పొందేలా ఒక పక్కా వ్యూహం అమలవుతోందని రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. మూడింట రెండు వంతుల మంది పార్టీ మారిపోతే దాన్ని విలీనం కేటగిరీలో చేర్చడం ద్వారా అనర్హతా వేటును తప్పించుకోవచ్చు.

2లో..

# రైతుల ముంగిటకే మార్కెట్



## - వ్యవసాయ అనుబంధ రంగాలపై సమీక్ష

- 'ఫార్మ్ టు హోమ్' విధానానికి చంద్రబాబు శ్రీకారం
- యడవోలు వద్ద కోకో సిటీ ఏర్పాటుకు పరిశీలన
- జూలైలో అగ్రికల్చర్ స్కూల్‌కు శంకుస్థాపన
- రైతు బజార్లలో ప్రకృతి సేద్య ఉత్పత్తులకు ప్రత్యేక కౌంటర్లు

అమరావతి (ప్రశ్న న్యూస్) రాష్ట్ర వ్యవసాయ రంగంలో సమూల మార్పులకు శ్రీకారం చుడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రైతులు పండించిన పంటలను, ముఖ్యంగా కూరగాయలు, పండ్లను నేరుగా వినియోగదారుల ఇళ్లకే చేర్చేందుకు 'ఫార్మ్ టు హోమ్' విధానాన్ని అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, దీనివల్ల రైతులకు గిట్టుబాటు ధర, వినియోగదారులకు తక్కువ ధరకే నాణ్యమైన ఉత్పత్తులు అందుతాయని

2లో..

హైదరాబాద్‌లో ఎబోలా

# వైరస్ భయం

## - శంషాబాద్ ఎయిర్ పోర్టులో హై అలర్ట్




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ప్రపంచ దేశాల్ని ఎబోలా వైరస్ వణికిస్తోంది. ముఖ్యంగా ఆఫ్రికా దేశాల్లో ఎబోలా వైరస్ వేగంగా విస్తరిస్తోంది. ఇప్పటికే ఎబోలాను అంతర్జాతీయ స్థాయిలో ఆందోళనకరమైన పబ్లిక్ హెల్త్ ఎమర్జెన్సీగా వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూహెచ్ఓ) ప్రకటించింది. ఈ నేపథ్యంలో భారత్ అప్రమత్తమైంది. దేశవ్యాప్తంగా అన్ని అంతర్జాతీయ ఎయిర్ పోర్టుల్లో మెడికల్ టీమ్ లను మోహరిస్తోంది కేంద్ర ప్రభుత్వం. వివిధ దేశాల నుంచి వచ్చిన ప్రయాణికులకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇక ఇదే విషయంపై కేంద్ర వైద్య,

2లో..

పంచాయతీ సిబ్బందికి

# తీపి కబురు

- రాష్ట్రంలోని 50 వేల మంది పంచాయతీ సిబ్బందికి ఒకటో తారీఖునే జీతాలు
- జీతాల కోసం ప్రతినెలా రూ. 50 కోట్ల ప్రత్యేక నిధుల విడుదల
- గ్రామ పంచాయతీలకు ఆర్థిక స్వేచ్ఛ కల్పిస్తూ కీలక నిర్ణయం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలోని గ్రామ పంచాయతీ సిబ్బందికి తెలంగాణ ప్రభుత్వం తీపికబురు అందించింది. సుమారు 50 వేల మంది గ్రామ పంచాయతీ సిబ్బందికి ప్రతి నెలా ఒకటో తారీఖునే జీతాలు చెల్లించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఐఏఎస్ అధికారులకు సమయానికి జీతాలు అందినట్లే, క్షేత్రస్థాయిలో పనిచేసే పంచాయతీ సిబ్బందికీ వేతనాలు అందాలని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖపై ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించి, పలు కీలక సూచనలు చేశారు. గ్రామ పంచాయతీ సిబ్బంది జీతాల చెల్లింపులో జాప్యం జరగకుండా, ప్రభుత్వం నుంచి ప్రతినెలా రూ.50 కోట్లను ప్రత్యేకంగా విడుదల చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. కేవలం పంచాయతీ

2లో..

# 45 ఏళ్ల అజ్ఞాతానికి స్వస్తి

## - మావోయిస్ట్ అగ్రనేత నరహరి లొంగుబాటు

- రూ.45 లక్షలు రివార్డు అందజేసిన తెలంగాణ డీజీపీ
- క్రమంగా అంతరించిపోతున్న మావోయిస్ట్ ఉద్యమం
- ఒక్కొక్కరుగా జనజీవన స్రవంతిలోకి ముఖ్య నేతలు
- కేంద్ర కమిటీ సభ్యుడు నరహరి, భార్య ధనమ్మ లొంగుబాటు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) మావోయిస్ట్‌లకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. అగ్రనేత, మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడు పసునూరి నరహరి అలియాస్ సంతోష్, ఆయన భార్య ధనమ్మ తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయారు.

2లో..

# బండి భగీరథ్‌కు కస్టడీ

- పోక్సో కేసులో అరెస్ట్ అయిన బండి భగీరథ్
- మూడు రోజుల కస్టడీకి అప్పగించాలని కోర్టును కోరిన పోలీసులు
- నిందితుణ్ని కస్టడీకి అప్పగించేందుకు న్యాయస్థానం ఓకే



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)సంచలనం సృష్టించిన పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న బండి భగీరథ్‌ను పోలీస్ కస్టడీకి అనుమతిస్తూ మేడ్చల్ మల్కాజ్‌గిరి కోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసులో భగీరథ్‌ను మరింత లోతుగా విచారించాల్సిన అవసరం ఉందని పోలీసులు వేసిన పిటిషన్‌ను కోర్టు సమర్థించింది. నిందితుడిని మూడు రోజుల పాటు పోలీస్ కస్టడీకి అప్పగిస్తూ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. బండి భగీరథ్‌పై నమోదైన తీవ్రమైన ఆరోపణల కారణంగా మరిన్ని ఆధారాలు సేకరించడానికి పోలీసులు కస్టడీని కోరారు. ఈ మూడు రోజుల వ్యవధిలో ఘటన జరిగిన తీరు, ఇతర ప్రమేయాలు, సాంకేతిక ఆధారాలపై పోలీసులు దృష్టి సారించనున్నారు. ఇప్పటికే బాధితురాలి నుండి సేకరించిన స్టేట్‌మెంట్ ఆధారంగా నిందితుడిని ప్రశ్నించి, కీలక విషయాలను వెలికితీయాలని దర్యాప్తు సంస్థ భావిస్తోంది. కోర్టు ఆదేశాల ప్రకారం, బుధవారం నుండి భగీరథ్‌ను పోలీసులు

2లో..

# గోదావరి గలగల కాదు.. వెలవెలబోతోంది

## - పుష్కరాల పనులు, కాలుష్య నివారణపై పవన్ కల్యాణ్ డెడ్‌లైన్!

- రాజమండ్రిలో పుష్కర ఏర్పాట్లను పరిశీలించిన పవన్
- గోదావరిలో కాలుష్య పరిస్థితిపై స్వయంగా తనిఖీలు
- ఆంధ్ర పేపర్ మిల్స్ వ్యర్థాలు నదిలో కలిసే ప్రాంతానికి బోటులో వెళ్లిన పవన్



అమరావతి (ప్రశ్న న్యూస్) మా తెలుగు తల్లికి మల్లెపూదండ... గోదారి, కృష్ణమ్మ గలగలలు అని మనం ఎంతో గర్వంగా పాడుకుంటాం, కానీ నేడు ఆ నదుల దుస్థితి చూస్తుంటే గలగలలు కాదు వెలవెల తీ లిరిక్స్ మార్చాలేమో అంటూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. తూర్పుగోదావరి జిల్లా పర్యటనలో భాగంగా రెండోరోజు ఆయన పవిత్ర గోదావరి నదిని సంరక్షించేందుకు ఒక మహా క్రూసేడ్‌ను ప్రారంభించారు.

2లో..

వెలుగుమట్ల భూ నిర్వాసితులకు

# న్యాయం చేయాలి

## - గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతో కవిత భేటీ

2లో..



# డీకేకు పట్టాభిషేకం

- కర్ణాటకలో నాయకత్వ మార్పుపై కాంగ్రెస్ స్పష్టత
- డీకే శివకుమార్‌కు మద్దతు తెలిపిన హైకమాండ్
- రాజ్యసభకు సిద్ధరామయ్యను పంపాలని నిర్ణయం



బెంగుళూరు (ప్రశ్న న్యూస్) కర్ణాటకలో ముఖ్యమంత్రి పదవి కోసం నెలకొన్న అధిపత్య పోరుకు ఎట్టకేలకు తెరపడింది. సీఎం పదవి విషయంలో డీకే శివకుమార్ వాదనకు

2లో..

తెలంగాణ రైతాంగం పట్ల

# కేంద్రానికి చిత్తశుద్ధి లేదు

## - బీజేపీ రాష్ట్రాల కంటే డబుల్ ధాన్యం కొనుగోలు చేస్తున్నాం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణా రైతాంగం పట్ల కేంద్ర ప్రభుత్వానికి ఎంత మాత్రం చిత్తశుద్ధి లేదని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖమంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. ధాన్యం దిగుబడితో పాటు కొనుగోలులోను తెలంగాణా రాష్ట్రం చరిత్ర సృష్టిస్తోందని అది రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతాంగా అనుకూల విధానాలకు తార్కాణమని మంత్ర పేర్కొన్నారు. మంగళవారం రోజున డాక్టర్ బి.ఆర్.అంబెద్కర్

2లో..

ఇందిరమ్మ ఇళ్ల పేరుతో

# కాంగ్రెస్ మోసం

## - రియల్ ఎస్టేట్ కుదేలైందన్న రాంచందర్ రావు

2లో..



# కేటీఆర్ ముఖ్యమంత్రి అభ్యర్థి.?

### తాను ఫామ్ హౌస్ లో వచ్చినా..

తాను ఇక ముఖ్యమంత్రిగా వచ్చినా పెద్దగా జనంలోకి తిరగలేనని, తాను ఫామ్ హౌస్ లోనే ఉండాలని ఆయన నిర్ణయించుకున్నట్లు కూడా పెద్దయెత్తున ప్రచారం జరుగుతుంది. కేసీఆర్ రాజకీయాల పట్ల అనాసక్తిగా ఉన్నారని, అయితే బీఆర్ఎస్ ను తిరిగి అధికారంలోకి తెచ్చేంత వరకూ జనంలోకి వస్తారని, ముఖ్యమంత్రి కుర్చీలో మాత్రం కూర్చోరని, దానిని కేటీఆర్ కు అప్పగించేందుకు సిద్ధమయ్యారని అంటున్నారు. హరీశ్ రావు కేటీఆర్ కు తోడుగా నిలిచేలా కూడా ఇప్పటికే కుటుంబ సభ్యుల మధ్య చర్చ కూడా జరిగిందన్న వార్తలు గుప్పుమంటున్నాయి. ఇప్పటికే కేటీఆర్ ను ముఖ్యమంత్రిని చేయడం ఆలస్యమయిందని, ఇక ఈసారి తప్పదన్న వ్యాఖ్యలు పెద్దాయన నోటి నుంచి వచ్చినట్లు తెలిసింది. బీఆర్ఎస్ నేతలు కూడా ఇదే అభిప్రాయంలో ఉన్నారు.

# మమతా బెనర్జీకి కోలుకోలేని షాక్

20 మంది ఎంపీలు పార్టీ మారితే సరిపోతుంది. ఈ పరిణామం మమతా బెనర్జీకి , అభిషేక్ బెనర్జీకి పెద్ద ఎదురుదెబ్బగా పరిణమించనుంది. మరీ ముఖ్యంగా మమతా బెనర్జీకి అత్యంత సన్నిహితులుగా భావించే కొందరు నేతలు కూడా ఈ జాబితాలో ఉండటం చర్చనీయాంశంగా మారింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత పార్టీలో నాయకత్వంపై అసంతృప్తి పెరగడం, భవిష్యత్తుపై ఆందోళన చెందుతున్న నేతలు ప్రత్యామ్నాయం వైపు చూస్తున్నట్లు భావిస్తున్నారు. మరోవైపు, పార్టీని కాపాడుకోవడానికి టీఎంసీ నాయకత్వం ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్ చెల్లాచెదురవ్వడం, సీనియర్ నేతల అసమ్మతి ఆ పార్టీని మరింత బలహీనపరుస్తోంది. ఒకవేళ ఈ ఎంపీల వలసలు నిజమైతే, జాతీయ స్థాయిలో తృణమూల్ కాంగ్రెస్ ప్రాభవం గణనీయంగా తగ్గిపోవడమే కాకుండా, పార్లమెంటులో కూడా ఆ పార్టీ బలం నామమాత్రంగా మిగిలిపోయే ప్రమాదం ఉంది. రాజ్యసభ ఎంపీలూ ఫిరాయించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం రాజ్యసభలో తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి 13 మంది సభ్యులు ఉన్నారు. 2026 బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమి పాలయ్యాక, లోక్‌సభ ఎంపీలతో పాటు రాజ్యసభ సభ్యులు కూడా బీజేపీ వైపు చూస్తున్నారనే ఊహాగానాలు బలంగా వినిపిస్తున్నాయి. తాజా రాజకీయ పరిణామాల ప్రకారం, సుమారు 8 మంది రాజ్యసభ ఎంపీలు బీజేపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఉన్నట్లుగా చెబుతున్నారు. లోక్‌సభలో ఇప్పటికే మెజారిటీ ఎంపీలు చేజారిపోయే స్థితిలో ఉండటంతో, రాజ్యసభలో కూడా ఇదే విధమైన తిరుగుబాటు జరిగితే పార్లమెంటులో టీఎంసీ ఉనికి ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉంది. ముఖ్యంగా జూన్ మొదటి వారంలో ఈ వలసలు ఉండవచ్చని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. రాబోయే రోజుల్లో బెంగాల్ రాజకీయాల్లో మరిన్ని కీలక మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది. ఇప్పటికే పలువురు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా బీజేపీ బాట పట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ రాజకీయ అనిశ్చితి మమతా బెనర్జీ సారథ్యంలోని తృణమూల్ కాంగ్రెస్‌కు అగ్నిపరీక్షగా మారింది.

# పంచాయతీ సిబ్బందికి తీపి కబురు

సిబ్బందికే కాకుండా, ప్రభుత్వంలోని అన్ని శాఖల పరిధిలోని అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులందరికీ నెల మొదటి రోజే జీతాలు అందేలా చూడాలని తేల్చిచెప్పారు. సిబ్బంది జీతాల చెల్లింపులో ఒక్కరోజు ఆలస్యమైనా సహించేది లేదని ఆయన గట్టిగా హెచ్చరించారు. ఈ సమావేశంలో గ్రామ పంచాయతీల ఆర్థిక స్వయంప్రతిపత్తిని బలోపేతం చేసే దిశగా మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. గత ప్రభుత్వం గ్రామ పంచాయతీల సొంత ఆదాయాన్ని ట్రెజరీ ఖాతాలో జమ చేయాలన్న నిబంధనను రద్దు చేయాలని ఆదేశించారు. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం, 2018లోని సెక్షన్ 70(3)కి సవరణలు చేసి, పంచాయతీల సొంత ఆదాయాన్ని ప్రభుత్వ ట్రెజరీకి బదులుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే జమ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇది పంచాయతీల ఆర్థిక స్వేచ్ఛను పునరుద్ధరించడానికి దోహదపడుతుందని సీఎం అభిప్రాయపడ్డారు. పెన్షన్ల పంపిణీ విధానంలోనూ మార్పులు చేయాలని సీఎం ఆదేశించారు. ప్రస్తుతం పోస్టల్ శాఖ ద్వారా అందిస్తున్న పెన్షన్లను ఇకపై నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని చెప్పారు. ఈ విధానం ద్వారా పారదర్శకత పెరుగుతుందని, అనర్హులను ఏరివేయడం సులభమవుతుందని తెలిపారు. ఓటర్ గుర్తింపు కార్డు, ఆధార్, సామాజిక-ఆర్థిక కుల గణన (ఎస్ఈసీసీ) డేటాను ఉపయోగించి పెన్షన్ల క్రమబద్ధీకరణ చేపట్టాలన్నారు. అర్హులైన వారికి కొత్త పెన్షన్లు మంజూరు చేయడానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి సీతక్క, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో ఎబోలా వైరస్ భయం

ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. దేశంలో ఇప్పటివరకూ ఒక్క ఎబోలా వైరస్ కేసు కూడా నమోదు కాలేదని వెల్లడించారు. వైరస్ వ్యాప్తిని నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఇక హైదరాబాద్ లోని శంషాబాద్ ఎయిర్ పోర్టులో హై అలర్ట్ ప్రకటించారు అధికారులు. ఎబోలా వైరస్ నేపథ్యంలో ఎయిర్ పోర్టులో ప్రయాణికులకు థర్మల్ స్కానర్లు, హెల్త్ చెకప్ లతో తనిఖీలు నిర్వహిస్తున్నారు. జ్వరం, వాంతులు, బలహీనత లక్షణాలు ఉన్న అనుమానితులను ఐసోలేషన్ కు తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు రాష్ట్రంలో ఎబోలా కేసులు నమోదు కాలేదని.. ఎబోలా లక్షణాలు ఉన్న వ్యక్తులను కూడా ఇప్పటివరకు గుర్తించలేదని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల మేరకు రాష్ట్రంలో అవసరమైన అన్ని ముందస్తు చర్యలు చేపట్టినట్లు వివరించారు. ముఖ్యంగా ఆఫ్రికా ఖండంలోని దేశాలైన డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఉగాండా, సౌత్ సూడాన్ వంటి ఎబోలా బాధిత దేశాల నుంచి వచ్చే ప్రయాణికులను శంషాబాద్ లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలోనే స్క్రీనింగ్, థర్మల్ స్కానింగ్ చేస్తూ వారిని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. విమానాశ్రయంలో డాక్టర్లు, హెల్త్ ఇన్‌స్పెక్టర్లు, ఫీల్డ్ స్టాఫ్, పారామెడికల్ సిబ్బందితో ప్రత్యేక బృందం విధులు నిర్వహిస్తోందని అన్నారు. అత్యవసర పరిస్థితుల కోసం 108 అంబులెన్స్‌లను 24 గంటలపాటు అందుబాటులో ఉంచుతున్నామని పేర్కొన్నారు. అలాగే గాంధీ హాస్పిటల్ లో 10 పడకల ప్రత్యేక ఐసోలేషన్ వార్డును ఇప్పటికే ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇక అనుమానితుల సాంపిల్స్ టెస్ట్ చేయడం కోసం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ, పుణేకు సాంపిల్స్ పంపించనున్నారు వైద్యులు.

# రైతుల ముంగిటకే మార్కెట్



ఆయన స్పష్టం చేశారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో వ్యవసాయం, దాని అనుబంధ రంగాలపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ఈ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. ఈ ఏడాది రాష్ట్రంపై ఎల్ నినో ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి, ప్రాంతాల వారీగా పంటల ప్రణాళికను సిద్ధం చేయాలని సూచించారు. ప్రతికూల వాతావరణంలోనూ రైతులు నష్టపోకుండా కనీస మద్దతు ధర కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వ సహకారం కూడా తీసుకోవాలన్నారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించాలని, ఈ విధానంలో విజయం సాధించిన రైతుల అనుభవాలను వినియోగించుకోవాలని తెలిపారు. భూసార పరీక్షలు నిర్వహించి, ఆ వివరాలను ఆన్‌లైన్‌లో రైతులకు అందుబాటులో ఉంచాలని, రైతు బజార్లలో ప్రకృతి సేద్య ఉత్పత్తులకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నీటి కొరత ఉన్నచోట్ల పీఎండీఎస్-హాఫ్ మూన్ పద్ధతుల్లో సేద్యం చేపట్టాలన్నారు.

### ప్రాంతీయ అభివృద్ధికి భారీ ప్రణాళికలు

రాయలసీమను ఉద్యానవన హబ్‌గా మార్చేందుకు రూ.40 వేల కోట్లతో 'పూర్వోదయ' పథకం కింద సాగునీటి ప్రాజెక్టులు, రహదారులు, గోదాముల వంటి మౌలిక వసతులు కల్పించనున్నట్లు సీఎం వివరించారు. దీనికి తోడు రూ.60 వేల కోట్ల ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం యడవోలు వద్ద 'కోకో సిటీ' ఏర్పాటు అంశాన్ని పరిశీలించాలని సూచించారు. అలాగే, జూలై నాటికి మదనపల్లెలో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు శంకుస్థాపన చేయనున్నట్టు వెల్లడించారు. పులివెందులలో సెంట్రల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబొరేటరీ నిర్మాణాన్ని పూర్తి చేసి, వినియోగంలోకి తెచ్చేందుకు తక్షణమే రూ.3 కోట్లు విడుదల చేయాలని ఆదేశించారు. రాయలసీమలో పండే అరటికి ప్రత్యేకంగా కోల్డ్ స్టోరేజ్ సౌకర్యం కల్పించాలని కూడా అధికారులను ఆదేశించారు. వ్యవసాయ యాంత్రీకరణను ప్రోత్సహించేందుకు క్లస్టర్ల వారీగా ప్రణాళికలు రూపొందించి, రైతు సాధికార సంస్థ ద్వారా హార్వెస్టర్లు, ఇతర యంత్ర పరికరాలు అందించాలని తెలిపారు.

# గోదావరి గలగల కాదు.. వెలవెలబోతోంది

పారిశ్రామిక వ్యర్థాలు నదిని విషతుల్యం చేస్తున్న తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

### బోటుపై పవన్ పర్యటన

మంగళవారం ఉదయం రాజమండ్రి రూరల్ పరిధిలోని వెంకటనగరం గ్రామం వద్ద పవన్ కల్యాణ్ పర్యటన ఉత్కంఠభరితంగా సాగింది. కేవలం సమీక్షా సమావేశాలకే పరిమితం కాకుండా ఆయన స్వయంగా బోటు ఎక్కి గోదావరి మధ్యలోకి వెళ్లారు. ఆంధ్రాపేపర్ మిల్స్ వంటి పరిశ్రమల నుంచి వెలువడుతున్న వ్యర్థ జలాలు నేరుగా నదిలో కలుస్తున్న ప్రాంతాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. నల్లగా మారుతున్న నదీ జలాలను చూసి ఆయన అసహనం వ్యక్తం చేశారు. పరిశ్రమల లాభాల కోసం ప్రజల ప్రాణాలతో పర్యావరణంతో చెలగాటం ఆడితే ఊరుకోబోమని ఆయన హెచ్చరించారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారులు నిబంధనల ఉల్లంఘనను ఎందుకు గుర్తించలేదని ఆయన ప్రశ్నించారు. వెంటనే కలుషిత నీటి నమూనాలను సేకరించిన ప్రయోగశాల పరీక్షలకు పంపాలని ఆదేశించారు.

### గోదావరి కాలుష్య నివారణ టాస్క్‌ఫోర్స్

గోదావరి నదిని కాలుష్యం కోరల నుంచి విడిపించేందుకు పవన్ కల్యాణ్ ఒక వ్యవస్థాగత మార్పునకు శ్రీకారం చుట్టారు. పరిశ్రమల వ్యర్థాలు, మురుగు నీరు నేరుగా నదిలో కలవడం వల్ల మత్స్యకారుల జీవనోపాధి దెబ్బతినడమే కాకుండా, తాగునీరు విషతుల్యం అవుతోంది. ఏలూరులో గతంలో జరిగిన నీటి కాలుష్య మరణాలను ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. నివేదికలు వచ్చిన వెంటనే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగాలని ఆయన స్పష్టం చేశారు. దీని కోసం ఒక ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ టాస్క్‌ఫోర్స్ పరిశ్రమల వ్యర్థాల విడుదలపై నిరంతర పర్యవేక్షణ చేస్తుంది. మురుగు నీటి హాట్ స్పాట్‌లను గుర్తించి, శుద్ధి చేసిన తర్వాతే నదిలోకి విడిచేలా చర్యలు చేపడుతుంది.

### 2027 గోదావరి పుష్కరాలపై డెడ్‌లైన్

రాబోయే 2027 గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై పవన్ కల్యాణ్ నిర్వహించిన సమీక్షా సమావేశంలో అధికారులకు చమటలు పట్టాయి. సుమారు పది కోట్ల మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్న ఈ భారీ ఈవెంట్ పట్ల అధికారులు నిర్లక్ష్యాన్ని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. 8600 కోట్లో చేపట్టాల్సిన పనులకు ఇంకా డీపీఆర్‌లు సిద్ధం కాకపోవడంపై మండిపడ్డారు. ఒకే సంవత్సరంలో ఏడు వేల రూపాయల పనులను నాణ్యతతో ఎలా పూర్తి చేస్తారని ప్రశ్నించారు. హడావిడిగా పనులు చేస్తే అవి కూలిపోతాయని ఆయన హెచ్చరించారు. గతంలో జరిగిన తొక్కిసలాట వంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆదేశించారు. గోదావరిని కలుషితం చేసి, పుష్కరాలకు వచ్చే భక్తులను ఆ మురికి నీటిలో స్నానం చేయమంటారా అని ఆయన నిలదీశారు. అటువంటి నీటిలో స్నానం చేస్తే పుణ్యం రాదని, రోగాలు వస్తాయని ఘాటు వ్యాఖ్యలు చేశారు. గోదావరి పుష్కరాలు కేవలం రాజమండ్రికి పరిమితం కాదని, ఆరు జిల్లాల్లోని 274 పంచాయితీల్లో ఏర్పాట్లు చేయాల్సి ఉంటుందని పవన్ గుర్తు చేశారు. క్లీన్ కృష్ణా, గోదావరి మిషన్ పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, కలెక్టర్లు తక్షణమే కాలుష్య నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

# డీకేకు పట్టాభిషేకం

కాంగ్రెస్ కేంద్ర నాయకత్వం ఏకగ్రీవంగా మద్దతు తెలిపిందని వర్గాలు ఎన్డీటీవీకి తెలిపాయి. ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు రాజ్యసభ సీటును ఆఫర్ చేసి, ఢిల్లీ నుంచే జాతీయ స్థాయిలో ఆయన మరింత కీలక పాత్ర పోషించాలని కోరినట్లు ఆ వర్గాలు తెలిపాయి. దానిపై నిర్ణయం తీసుకోవడానికి ఆయన సమయం కోరినట్లు పేర్కొన్నాయి. అయితే, రాబోయే రెండు మూడు రోజుల్లో సిద్దరామయ్య రాజీనామా చేసే అవకాశం ఉందని వర్గాలు నొక్కి చెప్పాయి. "డీకే శివకుమార్‌కు అధికార బదిలీ జరగాలనే విషయంలో హైకమాండ్ మొత్తం ఏకీభవించింది" అని వర్గాలు తెలిపాయి. మంగళవారం ఉదయం 6 గంటల పాటు సుదీర్ఘ సమావేశం నిర్వహించిన కాంగ్రెస్, రాష్ట్రంలోని మూడు రాజ్యసభ సీట్ల గురించే ఈ సమావేశం జరిగిందని పేర్కొంటూ, ఊహాగానాలకు దిగవద్దని మీడియాను హెచ్చరించింది. "రాజ్యసభ, ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి చర్చలు జరిగాయి.

ఇతర ఊహాగానాల్లో ఏమాత్రం నిజం లేదు" అని పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఒక నిమిషం ప్రకటనలో తెలిపారు. కర్ణాటకలో నాయకత్వ సమస్య ఏడాదికి పైగా రగులుతూనే ఉంది. 2023 అసెంబ్లీ ఎన్నికల తర్వాత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పుడు, రొటేషన్ విధానంలో ముఖ్యమంత్రి పదవి ఇస్తామని హైకమాండ్ హామీ ఇచ్చిందని శివకుమార్ మద్దతుదారులు పట్టుబట్టారు. కర్ణాటకలో ముఖ్యమంత్రి పదవికి పోటీదారులలో డీకే శివకుమార్ ఒకరిగా ఉన్నారని, రెండున్నరేళ్ల తర్వాత పదవి ఇస్తామని హామీ ఇచ్చిన తర్వాతే డిప్యూటీ పదవికి అంగీకరించారని వారు తెలిపారు. అయితే, మైనారిటీలు, వెనుకబడిన వర్గాలు, దళితులను కలుపుకొని ఉన్న 'అహింద' వర్గంలో సిద్ధరామయ్యకు ఆదరణను దృష్టిలో ఉంచుకుని, ఆయనను పదవి నుంచి తప్పించడానికి కాంగ్రెస్ పార్టీ వెనుకాడింది. ఈ వర్గం 2023లో వొక్కలిగ-లింగాయత్ కుల సమీకరణాన్ని అధిగమించి కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి సహాయపడింది. సిద్ధరామయ్య ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు పూర్తి చేసుకున్న నవంబరులో రొటేషన్ అంశంపై పెద్ద వివాదం చెలరేగినప్పటికీ, పొరుగున ఉన్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఈ వర్గాల నుంచి ఎదురుదెబ్బ తగిలే అవకాశం ఉందనే ఉద్దేశంతో కాంగ్రెస్ యథాతథ స్థితినే ఎంచుకుంది. కానీ ఇప్పుడు ఎన్నికలు ముగియడంతో శివకుమార్ సహనం నశిస్తోందని సిద్ధరామయ్య వర్గాలు సూచించడంతో పార్టీ కఠిన నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించుకుందని వర్గాలు తెలిపాయి. అయితే, స్థానిక నాయకులు మాత్రం సిద్ధరామయ్య కేంద్రంలో కీలక పాత్రను అంగీకరిస్తారా? లేదా? గౌరవప్రదంగా పదవి నుంచి వైదొలుగుతారా? లేక పదవీకాలాన్ని పొడిగించుకోవడానికి ప్రయత్నిస్తారా? అనే అంచనాల్లో తలమునకలయ్యాయి. సిద్ధరామయ్య పదవి నుంచి వైదొలగాలన్న నిర్ణయం పట్ల ఆయన సన్నిహితుల్లో కొందరు నాయకులు అసంతృప్తిగా ఉన్నారని వర్గాలు తెలిపాయి. తుది నిర్ణయం తీసుకునే ముందు అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలనూ పరిశీలించుకోవాలని వారు ఆయనను కోరారు. ప్రస్తుతం ఢిల్లీలో ఉన్న ముఖ్యమంత్రి, మంగళవారం రాత్రికి బెంగళూరుకు తిరిగి రానున్నారు.

## వెలుగుమట్ల భూ నిర్వాసితులకు

# న్యాయం చేయాలి

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** వికారాబాద్ జిల్లా పరిగి మండలం కడ్లాపూర్ గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా ఇండస్ట్రీయల్ పార్క్ కోసంఇచ్చిన భూ సేకరణ నోటీస్‌ను రద్దు చేయాలని టీఆర్ఎస్ అధినేత కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు గవర్నర్ శివప్రతాప్ శుక్లాకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం హైదరాబాద్ లోక్‌భవన్‌లో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లాను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఇండస్ట్రీయల్ పార్క్ కోసం ఇచ్చిన భూ సేకరణ నోటీస్‌ను రద్దు చేయాలని కోరారు. కండ్లాపూర్ గ్రామం రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు అత్యంత సమీపంలో ఉన్న ప్రాంతం అని వివరించారు. ఆ ప్రాంతం నల్లరేగడి భూముల్లో స్థానిక వందలాది మంది రైతు కుటుంబాలు వాణిజ్య పంటలు, కూరగాయలు, పండ్లు, వరి తదితర పంటలు పండిస్తూ జీవనం సాగిస్తున్నాయి అని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు వివరించారు.

### పేద కుటుంబాలకు ఉపాధి దొరకకుండా పోతుంది

వ్యవసాయానికి తోడు పాడి, మాంసం ఆధారిత ఉత్పత్తులతో రైతు కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయి అని టీఆర్ఎస్ అధినేత కవిత వెల్లడించారు. రైతులతోపాటు వ్యవసాయ కూలీలు, మార్కెట్ ఆధారిత వ్యవస్థల్లో పనిచేసే వారు, రవాణా వాహనాల వారు పరోక్షంగా ఉపాధిపొందుతున్నారు అని చెప్పుకొచ్చారు. కడ్లాపూర్ గ్రామంలోని 159 ఎకరాల 25 గుంటల భూమిని ఇండస్ట్రీయల్ పార్క్ ఏర్పాటు కోసం సేకరించేందుకు టీజీఐఐసీ( తెలంగాణ ఇండస్ట్రీయల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్) 2026 మార్చి 16న గెజిట్ నంబర్ వికెబి/31/2026 జారీ చేసింది. గ్రామంలోని అగ్రవర్ణాలకు చెందిన రైతుల భూముల్లో కాకుండా ఎస్సీ,ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన అత్యంత పేద రైతుల భూములనే ఇండస్ట్రీయల్ పార్క్ కోసం సేకరిస్తామని గెజిట్‌లో ప్రకటించారు. ఫలితంగా గ్రామంలోని పేద రైతులతో పాటు మిగిలిన పేద కుటుంబాలకు ఉపాధి దొరకకుండా పోతుంది అని టీఆర్ఎస్ అధినేత కవిత చెప్పుకొచ్చారు.

### టీజీఐఐసీ నిబంధనలను పాటించలేదు

ఇండస్ట్రీయల్ పార్క్ రావడం వల్ల కడ్లాపూర్ ప్రాంతంతోపాటు పరిసర గ్రామాలు కాలుష్యం బారినపడుతాయి అని టీఆర్ఎస్ అధినేత కవిత డిమాండ్ చేశారు. భూ సేకరణ చట్టం ప్రకారం ప్రకటన జారీ చేసిన 60 రోజుల్లోపు ప్రాజెక్టు ప్రతిపాదిత, ప్రభావ గ్రామాల్లో గ్రామ సభ నిర్వహించి పరిశ్రమ స్థాపన వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలి అని కవిత డిమాండ్ చేశారు. అలాగే ప్రాజెక్టు డీపీఆర్, పర్యావరణం పడే ప్రభావం సహా ఇతర ఏ ఒక్క అంశంలోనూ నిబంధనల మేరకు టీజీఐఐసీ వ్యవహరించలేదు అని ధ్వజమెత్తారు. పరిశ్రమ వల్ల పర్యావరణం పడే ప్రభావంపై అంచనా వేయడానికి అధ్యయనం కూడా చేయలేదు అని ధ్వజమెత్తారు. భూ సేకరణ చట్టం ప్రకారం ఏ ఒక్క నిబంధనను అనుసరించని ఈ గెజిట్‌ను రద్దు చేస్తూ ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నట్లు కవిత చెప్పుకొచ్చారు.

# బండి భగీరథ్‌కు కస్టడీ

తమ ఆధీనంలోకి తీసుకోనున్నారు. విచారణ సమయంలో నిందితుడిపై ఎటువంటి ఒత్తిడి గానీ, థర్డ్ డిగ్రీ గానీ ఉపయోగించకూడదని కోర్టు నిబంధనలు విధించింది. అలాగే ప్రతిరోజూ విచారణ ముగిసిన తర్వాత వైద్య పరీక్షలు నిర్వహించి, నివేదికను సమర్పించాలని పోలీసులను ఆదేశించింది. ఈ విచారణలో వెల్లడయ్యే అంశాలు కేసు తుది తీర్పులో అత్యంత కీలకం కానున్నాయి. మరోవైపు, ఈ కేసు రాజకీయంగా కూడా సున్నితమైనది కావడంతో నేపథ్యంలో పోలీసులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. కస్టడీ సమయంలో భగీరథ్‌కు సంబంధించిన మొబైల్ డేటా, కాల్ రికార్డ్స్, సోషల్ మీడియా కార్యకలాపాలను కూడా నిశితంగా పరిశీలించే అవకాశం ఉంది. ప్రస్తుతం భగీరథ్ చర్లపల్లి జైలులో రిమాండ్‌లో ఉన్నారు. కస్టడీ గడువు ముగిసిన తర్వాత తిరిగి ఆయనను కోర్టులో ప్రవేశపెట్టనున్నారు. పోక్సో చట్టం కింద నమోదైన కేసు కావడంతో పోలీసులు అత్యంత పకడ్బందీగా ఛార్జ్ షీట్ సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు.

# 45 ఏళ్ల అజ్ఞాతానికి స్వస్తి

మే 12న నరహరి దంపతులు లొంగిపోయినట్లు తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ మంగళవారం ప్రకటించారు. గత 45 ఏళ్లుగా అజ్ఞాతంలో ఉంటూ మావోయిస్ట్ పార్టీలో కీలక పాత్ర పోషించారు. జనజీవన స్రవంతిలో చేరిన నరహరి, ధనమ్మలను మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వం తరఫున నరహరికి రూ.25 లక్షలు, ధనమ్మకు రూ.20 లక్షల చెక్‌ను డీజీపీ అందజేశారు. తెలంగాణకు చెందిన నరహరి, ఝార్ఖండ్‌కు చెందిన ఆయన భార్య ధనమ్మ లొంగుబాటుకు సంబంధించి గత కొద్ది రోజులుగా ప్రచారం జరుగుతోంది. కానీ, ఇప్పటి వరకు పోలీసులు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువరించలేదు. తాజాగా, దీనిని ధ్రువీకరించిన పోలీసులు.. వారిని మీడియా ముందుకు తీసుకొచ్చారు. నరహరి స్వస్థలం పాత వరంగల్ జిల్లా కాజీపేట మండలం సోమిడి గ్రామం. వరంగల్ ఎల్‌బీ కాలేజ్‌లో 1982లో డిగ్రీ చదువుతోన్న సమయంలోనే ఆయన అజ్ఞాతంలోకి వెళ్లారు. ఆయనపై రూ.25 లక్షల రివార్డు ఉంది. లొంగుబాటుకు ముందు ఆయన బిహార్-ఝార్ఖండ్ స్పెషల్ ఏరియా కమిటీ ఇంఛార్జిగా, ఈస్ట్ రీజినల్ బ్యూరో (ఈఆర్‌బీ) ఇంఛార్జిగా, ఝార్ఖండ్ టెక్నికల్ డివిజన్ ఇన్‌ఛార్జిగా పనిచేశారు. ఏపీలో గుంటూరుకు చెందిన పూనం ప్రస్తుతం రీజినల్ కమిటీ మెంబర్ హోదాలో ఉన్నట్లు సమాచారం. మావోయిస్ట్ పార్టీ అత్యున్నత నిర్ణయాత్మక వేదికగా పరిగణించే కేంద్ర కమిటీ కొన్నేళ్లుగా తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌తో మావోల కంచుకోటలు బద్దలయ్యాయి. వరుస ఎన్‌కౌంటర్లు, అరెస్టులు, లొంగుబాట్లతో నక్సల్ సంఖ్య తగ్గిపోయింది. ఇప్పటికే పలువురు ముఖ్య నాయకులు ఎన్‌కౌంటర్లలో చనిపోగా, మరికొందరు లొంగిపోతున్నారు. ప్రస్తుతం నరహరి లొంగుబాటుతో కేంద్ర కమిటీలోని అత్యంత కీలక నేతలు మిసిర్ బెస్రా, గణపతి మాత్రమే మిగిలినట్లు భద్రతా వర్గాలు భావిస్తున్నాయి. ఇంకా, 45 మంది నాయకులే అజ్ఞాతంలో ఉన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల పేరుతో కాంగ్రెస్ మోసం

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలను మోసం చేస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి సర్కార్ ప్రజలను ప్రలోభాలకు గురి చేస్తోందని ధ్వజమెత్తారు. గత కేసీఆర్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో మోసం చేయగా, ఇప్పుడు కాంగ్రెస్ కూడా అదే బాటలో నడుస్తూ పేదలకు తీవ్ర అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. ఎంఐఎం ఒత్తిడికి లొంగి హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను మూడు ముక్కలు చేశారని దుయ్యబట్టారు. నగరంలో డివిజన్ల ఏర్పాటుపై అధికారులకే క్లారిటీ లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి మజ్లిస్ పార్టీయే ముఖ్యమని, నగర ప్రజలు కాదని విమర్శించారు. భాగ్యనగరంలో తాగునీటి ఎద్దడి, కాలుష్య నియంత్రణపై ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని, చిన్న వాన పడితేనే నగరం మునిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ పాలనలో నేతలు రియల్ ఎస్టేట్ పేరుతో జేబులు నింపుకోగా, ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో ఆ రంగం పూర్తిగా కుదేలైందని రామచందర్ రావు ఆరోపించారు. హైదరాబాద్‌ను నిజమైన విశ్వనగరంగా మార్చడం, అవినీతి రహిత పాలన అందించడం ఒక్క బీజేపీకే సాధ్యమని స్పష్టం చేశారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీలకు ప్రజలు బుద్ధి చెప్పి, బీజేపీని గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు.

# తెలంగాణ రైతాంగం పట్ల కేంద్రానికి చిత్తశుద్ధి లేదు

రాష్ట్ర సచివాలయంలో తనను కలిసిన మీడియా ప్రతినిధులతో ఆయన చిట్ చాట్ చేశారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులు ధాన్యం కొనుగోలు పై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను మంత్రి దృష్టికి తీసుకు రాగా ఆయన సావధానంగా బదులిస్తూ అన్నింటినీ నివృత్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి చేతులు దులుపుకుందని ఆయన మండిపడ్డారు. పెరిగిన ధాన్యం దిగుబడికి అనుకూలంగా రాష్ట్ర ప్రభుత్వం రైతాంగానికి బాసటగా నిలిచి చివరి గింజ వరకు కొనుగోలు చేసేందుకు ఉపక్రమించిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.

### 8575 కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతోటే రాష్ట్ర ప్రభుత్వం దాన్యం కొనుగోలు చేస్తుందని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. యావత్ భారతదేశంలో ఎక్కడా లేని విదంగా 8575 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 54 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసిందని ఆయన తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యానికి 48 గంటలలో నేరుగా రైతుల ఖాతాలో కి చెల్లింపులు జరుపుతున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మొత్తం ఎపిసోడ్ లో మద్దతు ధర ప్రకటించిన కేంద్రం కేవలం 52 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు పరిమితము అయ్యిందని అయినా రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తగ్గకుండా తెలంగాణా రైతాంగానికి అండగా ఉంటూ 75 లక్షల మెట్రిక్ టన్నుల దాన్యం కొనుగోలు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. వాస్తవ పరిస్థితులను పట్టించుకోకుండా బిజెపి నాయకులు రాజకీయ విమర్శలకు దిగడం శోచనీయమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఇంత అంత అని చెప్పుకునే బిజెపి పాలిత రాష్ట్రాలలో కుడా ఇంత పెద్ద ఎత్తున ధాన్యం దిగుబడి, కొనుగోలు జరగలేదని ఆయన గణాంకాలతో సహా వివరించారు.

### రూ.9వేల కోట్లు రైతులకు చెల్లింపులు

తెలంగాణా రాష్ట్ర రైతాంగం పట్ల కేంద్ర ప్రభుత్వ సహకార లోపం తో రాష్ట్ర ప్రభుత్వం మీద పెనుభారం పడుతుందని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణా రైతాంగాన్నీ కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకుండా ఉన్న విషయం రాష్ట్ర బిజెపి నాయకత్వం పట్టించుకోకుండా తెలంగాణా రాష్ట్రంలో బీజేపీ నేతలు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలి రావడం వెనుక ఉన్న ఉద్దేశ్యం తెలంగాణా రాష్ట్ర ప్రజలు గమనించాలని మంత్రి కోరారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో పనిచేస్తున్న హమాలీలు అందరూ బీహార్, పశ్చిమ బెంగాల్ కు చెందిన వారు కావడం ఎన్నికలను పురస్కరించుకుని వారు తమ తమ సొంత రాష్ట్రాలకు వెళ్ళడంతో కొంత ఇబ్బంది జరిగిన మాట వాస్తావమేనని అయినా ఇన్ని వత్తిడిలను తట్టుకుంటు ఇప్పటి వరకు 54 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసిన రాష్ట్ర ప్రభుత్వం 9,000 వేల కోట్లు రైతులకు చెల్లింపులు చేసిందని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

## తుగ్గలిలో ఉపాధి హామీ పనులపై

# ఏపీడీ సమీక్ష



**తుగ్గలి** తుగ్గలి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం నందు మంగళవారం రోజున పత్తికొండ డివిజన్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ లక్ష్మన్న తుగ్గలి ఎంపీడీవో విశ్వమోహన్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో భాగంగా ఏపిడి లక్ష్మన్న మాట్లాడుతూ కూలీల హాజరు,పనిదినాల కల్పన,షెల్ఫ్ ఆఫ్ వర్క్స్ పురోగతి, ఎన్ఎంఎంఎస్ హాజరు,జలధార-జలహారతి పనుల గ్రౌండింగ్,మండల ప్రణాళిక తయారీ, ఉపాధి హామీ పథకం అన్ని పారామీటర్లు వంటి విషయాలపై అధికారుల ద్వారా వివరాలను అడిగి తెలుసుకున్నారు. జలధార జల హారతి పనులపై మండల వ్యాప్తంగా మంచి పురోగతికి సాధించాలని ఆయన ఉపాధి సిబ్బందికి తెలియజేశారు. పనుల గ్రౌండింగ్ వేగవంతం చేయాలని,100% ఎన్ఎంఎంఎస్ హాజరు నమోదుతో పనిదినాల కల్పన పెంచాలని ఏపీడీ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ రామకృష్ణ,ఈసీ రాజశేఖర్,టిఏలు,ఫీల్డ్ అసిస్టెంట్లు, సీనియర్ మెటీలు తదితరులు పాల్గొన్నారు.

# వీధి వ్యాపారుల కష్టాలు తీర్చడమే లక్ష్యం

## - పొంగూరు షరణి

### వీధి వ్యాపారులకు ఆపన్నహస్తం..

### నాడు ఎన్నికల్లో మాట.. నేడు చేతుల్లో తోపుడు బండి




నెల్లూరు(ప్రశ్న న్యూస్) సిటీ నియోజకవర్గంలో నిరుపేద వీధి వ్యాపారులను ఆదుకునేందుకు రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ కుటుంబం గొప్ప సంకల్పంతో ముందుకెళుతోంది. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన మాట ప్రకారం తోపుడు బండ్ల అద్దెలు కట్టలేక ఇబ్బంది పడుతున్న పేద వీధి వ్యాపారులకు విడతలవారీగా తోపుడు బండ్లు పంపిణీ చేస్తున్నారు.తాజాగా మంగళవారం మంత్రి కుమార్తె పొంగూరు షరణి చేతుల మీదుగా 86 మందికి ఉచితంగా తోపుడు బండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా షరణి మాట్లాడుతూ నాన్నగారు నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన వారే కావడంతో పేదల కష్టాలు ఆయనకు బాగా తెలుసన్నారు.అద్దెలు కట్టలేక ఇబ్బంది పడుతున్న పేద వ్యాపారులకు ఇప్పటివరకు విడతల వారీగా 780 తోపుడు బండ్లను అందజేశామని తెలిపారు. పేదలు, కార్యకర్తల సంక్షేమం కోసం ఐదేళ్లలో 50 కోట్ల ప్రత్యేక నిధిని (ఏడాదికి 10 కోట్లు) కేటాయించినట్లు వెల్లడించారు.నెల్లూరు నగరాన్ని సర్వతోముఖాభివృద్ధి వైపు నడిపిస్తూనే, పేదలకు ఉచిత కార్పొరేట్ విద్య, వైద్యాన్ని అందిస్తున్నట్లు పొంగూరు షరణి పేర్కొన్నారు. విఆర్సీ తరహాలోనే నగరంలోని మరో 15 ప్రభుత్వ పాఠశాలలను త్వరలోనే కార్పొరేట్ స్థాయిలో ఆధునీకరించబోతున్నామని స్పష్టం చేశారు. ఈ సేవా కార్యక్రమంలో టీడీపీ డివిజన్ కార్పొరేటర్లు, క్లస్టర్ ఇంచార్జిలు మరియు ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న కార్పొరేటర్ కేకే

### అనాథగా మారిన వృద్ధ మహిళకు అన్నీ తానై అంత్యక్రియలు



కొత్తగూడెం (ప్రశ్న న్యూస్) కొత్తగూడెంలో ఓ వృద్ధ మహిళ కన్నం చంద్రమ్మ (70) మృతదేహం గంటల తరబడి పడి ఉన్నా ఎవరూ ముందుకు రాని పరిస్థితిలో 25వ డివిజన్ కార్పొరేటర్ కనుకుంట్ల శ్రీను (కేకే) మానవత్వం చాటుకున్నారు. ఎండ తీవ్రతను తట్టుకోలేక మృతి చెందిన ఆ మహిళకు కుటుంబ సభ్యులు, బంధువులు ఉన్నప్పటికీ అంత్యక్రియలు నిర్వహించేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో ఆయన స్వయంగా బాధ్యత తీసుకుని అంత్యక్రియలు నిర్వహించారు. స్థానికుల సమాచారం మేరకు ఘటనాస్థలానికి చేరుకున్న కార్పొరేటర్ కేకే పరిస్థితిని పరిశీలించి వెంటనే స్పందించారు. మృతదేహాన్ని తరలించే ఏర్పాట్లు చేయడంతో పాటు అవసరమైన అన్ని కార్యక్రమాలను దగ్గరుండి నిర్వహించారు. అంత్యక్రియలకు కావాల్సిన ఖర్చులను కూడా ఆయనే భరించినట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. సమాజంలో మానవ సంబంధాలు క్షీణిస్తున్న వేళ కార్పొరేటర్ కేకే చూపిన మానవత్వానికి ప్రజలు అభినందనలు తెలిపారు. “పదవిలో ఉండటం ఒక్కటే కాదు.. కష్టసమయంలో మనిషికి తోడుగా నిలవడం గొప్ప విషయం” అంటూ స్థానికులు ప్రశంసించారు.

# లిఫ్ట్ లో ఇరుక్కున్న ఊపిరి ఆడటం లేదు

### - డీఆర్డీఏ, ఎపిడి అధికారి

### - తోటి ఉద్యోగులకు చరవాణితో సమాచారం



సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) జిల్లా సమీకృత కార్యాలయల సముదాయంలోని లిఫ్టులో డీఆర్డీఏ ఎపిడి అధికారి కూర నర్సింహులు ఇరుక్కు పోయారు. విధులకు హాజరయ్యేందుకు కలెక్టరేట్ కు చేరుకున్న ఆయన పై అంతస్తుకు వెళ్లడానికి లిఫ్ట్ ఎక్కారు. సాంకేతిక కారణాలతో లిఫ్ట్ మధ్యలోనే ఆగిపోయింది. దీంతో చాలా సేపు లిఫ్ట్ లోనే ఉండి పోవడంతో ఆయన శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది ఎదురయింది. దీంతో ఆయన తాను లిఫ్ట్ లో ఇరుక్కు పోయానని తనకు శ్వాస ఆడడం లేదు అంటూ, తోటి ఉద్యోగులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. తన సహచర ఉద్యోగి లిఫ్ట్ లో ఇరుక్కు పోయి శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతున్నాడని సమాచారంతో ఆందోళన చెందారు.సుమారు గంటన్నర తర్వాత సాంకేతిక నిపుణులు వచ్చి లిఫ్ట్ లో నుండి అధికారిని బయటకు తెచ్చారు. గంట పైగా లిఫ్ట్ లోనే ఇరుక్కుపోవడంతో లిఫ్టును సరిగా మెయింటెన్ చేయడం లేదని అధికారులకు ఫిర్యాదు చేస్తానని ఆవేదన వ్యక్తం చేశాడు అధికారి. దీంతో ఏం జరుగుతుందోనని ఆందోళన చెందిన కలెక్టరేట్ ఉద్యోగులు అధికారి క్షేమంగా తిరిగి రావడంతో అంత ఊపిరిపీల్చుకున్నారు.

# మోడీపై శివరాజ్ పుస్తకం

**న్యూఢిల్లీ,** కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ రచించిన పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హాజరయ్యారు. ప్రధాని నరేంద్ర మోదీతో తనకున్న వ్యక్తిగత అనుబంధం, అనుభవాల గురించి వివరిస్తూ చౌహాన్ ‘అప్నాపన్: మై ఎక్స్‌పీరియన్సెస్ విత్ నరేంద్ర మోదీ’ పేరుతో ఈ పుస్తకాన్ని రాశారు. ఢిల్లీలోని పూసాలో ఉన్న ఐకార్ క్యాంపస్‌లో మంగళవారం ఈ కార్యక్రమం జరిగింది.ఈ పుస్తకాన్ని మాజీ ప్రధాని హెచ్.డి. దేవెగౌడ, మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు ముఖ్య అతిథులుగా హాజరై ఆవిష్కరించారు. ఈ వేడుకలో ఏపీ మంత్రి నారా లోకేష్ పాల్గొని పలువురు జాతీయ స్థాయి నేతలను కలిశారు. ఈ కార్యక్రమానికి ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా, పలువురు కేంద్ర మంత్రులు, ఎంపీలు, బీజేపీ సీనియర్ నేతలు, సాహితీవేత్తలు హాజరయ్యారు. ప్రధాని మోదీ నాయకత్వ లక్షణాలు, ఆయన వ్యక్తిత్వం, ప్రజలతో మమేకమయ్యే తీరును ఈ పుస్తకం చక్కగా వివరిస్తుందని వక్తలు ప్రశంసించారు. ఎన్డీఏ భాగస్వామ్య పక్షమైన టీడీపీ తరఫున లోకేష్ ఈ కార్యక్రమంలో పాల్గొనడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# ఆంధ్రప్రదేశ్ బెస్తలు ఎంపీ, ఎమ్మెల్యేలు

# కావాలి, కూటమి సర్కారుదే బాధ్యత

- టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ కి బెస్తల వినతి
- సానుకూలంగా స్పందించిన నారా లోకేష్
- 13 లక్షల మంది బెస్తల్లో ఒక్క ఎమ్మెల్యే, ఎంపీ లేరు
- ఏపీలో బెస్తలకు రాజకీయ పార్టీల అన్యాయం



మంగళగిరి ( ప్రశ్న న్యూస్ ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గంగపుత్రులు , బెస్త కులస్తులకు ఏపీ అసెంబ్లీ , లెజిస్లేటివ్ కౌన్సిల్ సభల్లో , అలాగే రాజ్యసభలోనూ ప్రవేశం కోసం టీడీపీ పార్టీ , కూటమి ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరుతూ తెలుగుదేశం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ కి , ఆంధ్రప్రదేశ్ బెస్త సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ ,టిడిపి నంద్యాల జిల్లా బీసీ సెల్, అధ్యక్షులు, ఏపీ బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ ప్రజావైద్యశాల బెస్త మల్లికార్జున వినతి పత్రం సమర్పించారు.

### గణతంత్ర రాజ్యం వచ్చినా బెస్తలకు చట్టసభల ప్రవేశం రాలేదు..

భారతదేశానికి గణతంత్రం వచ్చినా , తమ కులానికి నాటి నుంచి నేటి వరకు చట్టసభల్లోకి ప్రవేశం రాలేదని , ఈ మేరకు సాంప్రదాయ మత్స్యకారులైన బెస్త సమాజానికి చట్టసభల్లో తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే వందలాదిగా ఉన్న బీసీ కులాల్లోకి బెస్తలు బీసీ ఏ సీరియల్ నెంబర్ 1లో ఉన్నారని, బెస్త గంగపుత్రులు దాదాపు 13 లక్షల జనాభా కలిగి ఉన్నారని , అయినప్పటికీ బెస్త సమాజం రాష్ట్ర సామాజిక-రాజకీయ వ్యవస్థలో చాలా ముఖ్యమైనదిగా ఉన్నా, అత్యంత వెనుకబాటులో ఉందని గుర్తు చేశారు.

### ఏ పార్టీ కూడా ఎంపీ , ఎమ్మెల్యేను చేయలేదు..

ఇప్పటివరకు ఏ రాజకీయ పార్టీ కూడా తమ సమాజానికి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, లోక్‌సభ లేదా రాజ్యసభ వంటి చట్టసభల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించలేదనే విషయం విచారకరమన్నారు. రాష్ట్రంలో జరిగిన ఇటీవలే ఎన్నికలలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి బెస్త సమాజం సమగ్రంగా మద్దతు ఇచ్చింది.

### సీఎం చంద్రబాబు , టీడీపీ , కూటమి సర్కారుపై బెస్తలకు విశ్వాసం..

సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంపై విశ్వాసంతో రాష్ట్ర వ్యాప్తంగా బెస్తలు టీడీపీ జనసేన కూటమికి బలమైన అండగా నిలిచారు. ఈ నేపథ్యంలో మా సమాజం సామాజిక న్యాయం మరియు రాజకీయ ప్రాతినిధ్యం కోరుకోవడం సహజమైనదేనని, ఈ బాధ్యతను కూటమి ప్రభుత్వం నెరవేర్చాల్సిందే అన్నారు.

### గవర్నర్ కోటా ఎమ్మెల్సీగా ఒక్క ఛాన్స్ కావాలి..

త్వరలో జరగనున్న గవర్నర్ కోటా ఎమ్మెల్సీకి సాంప్రదాయక మత్స్యకారులైన బెస్తలను ఎంచుకోవాలని కోరారు. రాజ్యసభ స్థానాలకు సైతం బెస్త సమాజానికి ప్రాధాన్యతనిస్తూ ఒక్క అవకాశం ఇవ్వాలన్నారు. ఇప్పటివరకు చట్టసభల్లో అడుగు పెట్టని తమ సమాజానికి ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా మీరు సామాజిక న్యాయానికి, బీసీ సాధికారతకు మన ప్రభుత్వం కట్టుబడి ఉందనే సందేశాన్ని రాష్ట్ర ప్రజలకు ఇచ్చినట్లు ఉంటుందన్నారు. మీ నాయకత్వంలో బెస్త సమాజానికి తగిన గౌరవం, రాజకీయ అవకాశం లభిస్తుందని మా సమాజం అంతా ఆశతో ఎదురు చూస్తున్నారని తెలిపారు. త్వరలోనే రాజకీయంగా అట్టడుగున ఉన్న బెస్తలను చట్టసభల్లోకి ప్రవేశం ఇప్పిస్తారని విశ్వసిస్తున్నట్లు చెప్పారు.

# కార్మికులకు కనీస వేతనం రూ.25 వేలు ఇవ్వాలి

### బిఎంఎస్ నేత సల్ల శ్రీనివాస్



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్) సిద్దిపేట జిల్లా గజ్వేల్ తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన కనీస వేతనాల పెంపు అసంపూర్తిగా ఉందని, పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రతి కార్మికుడికి కనీస వేతనం రూ.25 వేలుగా నిర్ణయించాలని బిఎంఎస్ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు సల్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు.మంగళవారం సిద్దిపేటలోని బిఎంఎస్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన రూ.16 వేల కనీస వేతనంతో కార్మికులు జీవనం కొనసాగించడం అసాధ్యమని అన్నారు. పెరుగుతున్న నిత్యావసర ధరలు, కుటుంబ భారం దృష్ట్యా కనీస వేతనాన్ని రూ.25 వేల వరకు సవరించాలని బిఎంఎస్ యూనియన్ తరఫున డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.గత 15 ఏళ్లుగా కనీస వేతనాలను సకాలంలో పెంచకుండా గత బీఆర్ఎస్ ప్రభుత్వం యాజమాన్యాలకు అనుకూలంగా వ్యవహరించి కార్మికులకు తీవ్ర అన్యాయం చేసిందని ఆరోపించారు. అప్పుడే వేతనాలను పెంచి ఉంటే ప్రస్తుతం కనీస వేతనం రూ.25 వేల దరిదాపుల్లో ఉండేదని ఆవేదన వ్యక్తం చేశారు.కనీస వేతనాల పెంపు కోసం బిఎంఎస్ అనేక పోరాటాలు చేసి కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చిందని తెలిపారు. అయితే కేంద్రం నిర్దేశించిన కనీస వేతనాల కంటే రాష్ట్ర ప్రభుత్వం తక్కువగా ఖరారు చేయడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.ప్రస్తుతం ప్రకటించిన వేతన పెంపు కార్మికుల శ్రమకు తగిన గుర్తింపు కాదని, కార్మికులను నిర్లక్ష్యం చేస్తే గత ప్రభుత్వాలకు పట్టిన గతే ప్రస్తుత ప్రభుత్వానికీ పడుతుందని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కార్మిక సంఘాల సూచనలు, సలహాలు తీసుకొని కనీస వేతనాలను సవరించి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే బిఎంఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని స్పష్టం చేశారు.

# నారాయణవనం ఆలయ బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

- మే 28 నుండి జూన్ 05 వరకు శ్రీ పద్మావతి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాలు
- శ్రీ పద్మావతి--శ్రీనివాసుల పవిత్ర కల్యాణానికి నిలువెత్తు సాక్ష్యం నారాయణవనం
- కళ్యాణ కటాక్షంతో భక్తుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న శ్రీనివాసుడు
- కుటుంబ సౌఖ్యం ప్రసాదించే శ్రీ కళ్యాణ వేంకటేశ్వర స్వామి
- 2500 ఏళ్ల తిరగలిలో సజీవంగా నిలిచిన దివ్య కళ్యాణ ఘట్టం






నారాయణవనం(ప్రశ్న న్యూస్)శ్రీ పద్మావతి సమేత శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు మే 28 నుండి జూన్ 05వ తేదీ వరకు జరుగనున్న నేపథ్యంలో మే 27వ తేదీ రాత్రి 07.30 గం.లకు అంకురార్పణ జరుగనుంది. ఈ సందర్భంగా స్వామి వారిని ఉదయం 06 గం.లకు సుప్రభాతంతో మేల్కొలిపి పలు వైదిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

### ఆలయ ప్రాముఖ్యత..

శ్రీ పద్మావతి సమేత శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామివారి దివ్య దర్శనం దంపతుల జీవితాల్లో సుఖశాంతులు, పరస్పర అవగాహన, కుటుంబ సౌభాగ్యాన్ని ప్రసాదిస్తుందని భక్తుల అచంచల విశ్వాసం. వివాహం ఆలస్యమవుతున్న యువతీ యువకులు, కొత్తగా వివాహమైన దంపతులు, కుటుంబ సమస్యలతో బాధపడుతున్న వారు స్వామివారి కళ్యాణ కటాక్షం కోసం ఈ క్షేత్రాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో దర్శించుకుంటారు. “శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి”గా ప్రసిద్ధి చెందిన ఈ దివ్యక్షేత్రం భక్తుల హృదయాల్లో విశిష్ట స్థానాన్ని సంపాదించుకుంది. దాంపత్య జీవితంలో ఆనందం, అనురాగం, ఆధ్యాత్మిక ప్రశాంతత కోసం భక్తులు స్వామివారిని ప్రార్థిస్తుంటారు. శ్రీనివాసుని కళ్యాణ మహిమ జీవితాలను మంగళమయం చేస్తుందనే విశ్వాసంతో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుండి ప్రతిరోజూ వేలాదిమంది భక్తులు నారాయణవనానికి తరలివచ్చి స్వామివారి దివ్యానుగ్రహాన్ని పొందుతున్నారు.

### స్థల పురాణం..

పురాణ ప్రాశస్త్యం ప్రకారం ఆకాశరాజు పరిపాలించిన రాజధానిగా నారాయణవనం వెలుగొందింది. ఇదే పుణ్యభూమిలో ముక్కోటి దేవతల సాక్షిగా శ్రీనివాసుడు, పద్మావతి అమ్మవారితో దివ్య కళ్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించుకున్నాడని స్థల పురాణం వివరిస్తోంది. ఆ దివ్య వివాహ ఘట్టానికి చిరస్మరణగా పద్మావతి అమ్మవారి తండ్రి ఆకాశరాజు ఈ ఆలయాన్ని నిర్మించారని భక్తుల విశ్వాసం. అందుకే ఈ క్షేత్రం కల్యాణ మహిమను ప్రసరించే పవిత్ర దివ్యక్షేత్రంగా యుగయుగాలుగా భక్తుల ఆరాధనలను అందుకుంటోంది.

### గర్భాలయం..

దాదాపు 5.5 ఎకరాల విస్తీర్ణంలో రెండు ప్రాకారాలతో విరాజిల్లుతున్న శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయం ఆధ్యాత్మిక వైభవానికి ప్రతీకగా నిలుస్తోంది. తొలి ప్రాకారంలో శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామివారు దివ్య మంగళవిగ్రహంతో భక్తులకు దర్శనమిస్తుండగా, శ్రీ పద్మావతి అమ్మవారు, శ్రీ ఆండాళ్ అమ్మవారు, ఉప సన్నిధులు ఆలయ మహిమను మరింత పెంపొందిస్తున్నాయి.

### గోపురాలు..

ఆలయంలోకి ప్రవేశించగానే భక్తులకు దివ్య దర్శనమిచ్చే ఏడు అంతస్తుల మహోన్నత రాజగోపురం విజయనగర శిల్పకళా వైభవాన్ని ప్రతిబింబిస్తోంది. సుమారు 150 అడుగుల ఎత్తుతో ఆకాశాన్ని తాకేలా నిర్మితమైన ఈ ప్రధాన గోపురాన్ని విజయనగర సామ్రాజ్య మహా చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు నిర్మించారు. మూడు అంతస్తులతో కళాత్మకంగా నిర్మించిన మధ్య గోపురాన్ని శ్రీ వీర నరసింహదేవరాయలు నిర్మించగా, దాని శిల్పసౌందర్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. పుష్పవాటికలతో అలరారే రెండవ ప్రాకారమైన తోట ప్రాకారం ఆధ్యాత్మిక ప్రశాంతతను పంచుతూ భక్తులకు దివ్యానుభూతిని కలిగిస్తోంది.

### ఉచిత అన్న ప్రసాదాలు..

శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామివారిని దర్శించుకునే భక్తులకు దాతల సహకారంతో ప్రతిరోజూ మధ్యాహ్నం రుచికరమైన ఉచిత అన్నప్రసాదాలను భక్తిశ్రద్ధలతో పంపిణీ చేస్తున్నారు. “అన్నదానం మహాదానం” అనే సనాతన ధర్మ సంప్రదాయాన్ని ప్రతిబింబిస్తూ ఈ సేవ భక్తుల హృదయాల్లో విశేష ఆనందాన్ని నింపుతోంది.

## పాలిటెక్నిక్ ప్రవేశాల కౌన్సెలింగ్‌కు
# గజ్వేల్‌లో ప్రత్యేక కేంద్రం



గజ్వేల్ (ప్రశ్న న్యూస్) సిద్ధిపేట జిల్లా గజ్వేల్‌లోని ప్రభుత్వ మోడల్ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్ కళాశాల ను రాష్ట్ర ప్రభుత్వం పాలిటెక్నిక్ ప్రవేశాల కౌన్సెలింగ్ సేవల ప్రత్యేక కేంద్రంగా ఎంపిక చేసింది. రాష్ట్ర సాంకేతిక విద్యా మండలి ఆధ్వర్యంలో నిర్వహించే ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా ఈ కేంద్రం సేవలు అందించనుంది.కళాశాల ప్రిన్సిపాల్ తెలిపిన వివరాల ప్రకారం, పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సర్టిఫికెట్ల పరిశీలన, అభిరుచుల నమోదు, సీట్ల కేటాయింపుకు సంబంధించిన సేవల కోసం గజ్వేల్ సంగాపూర్ రోడ్డులోని బాలుర విద్యా సముదాయ ప్రాంగణంలో ఉన్న కళాశాలకు హాజరుకావచ్చని తెలిపారు. ఈ నెల 27వ తేదీ నుంచి ప్రాథమిక వివరాల నమోదు, రుసుము చెల్లింపు, సమయ నిర్ధారణ ప్రక్రియ ప్రారంభం కానుంది. 29వ తేదీ నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించనున్నారు. అదే సమయంలో అభిరుచుల నమోదు ప్రక్రియ కొనసాగి వచ్చే నెల 3వ తేదీతో ముగియనుంది. అనంతరం జూన్ 6వ తేదీలోపు సీట్ల కేటాయింపు పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు.సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరయ్యే విద్యార్థులు ప్రవేశ పరీక్ష ర్యాంకు పత్రం, హాల్ టికెట్, పదో తరగతి మార్కుల జాబితా, చదువుకున్న ధృవపత్రాలు, బదిలీ ధృవపత్రం, ఆదాయ ధృవపత్రం, ఆధార్ కార్డు తదితర ఒరిజినల్ పత్రాలతో పాటు వాటి జిరాక్స్ ప్రతులను కూడా తీసుకురావాలని సూచించారు.విద్యార్థులకు అభిరుచుల ఎంపికలో సరైన మార్గదర్శనం అందించేందుకు కళాశాలలో ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. గజ్వేల్, సిద్ధిపేట మరియు పరిసర ప్రాంతాల విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని సమీపంలోనే కౌన్సెలింగ్ సేవలను పొందాలని కోరారు.

## మహానాడును విజయవంతం చేద్దాం పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి పిలుపు



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించబోయే మహానాడు కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బొజ్జల పిలుపునిచ్చారు. పార్టీ భవిష్యత్తు కార్యాచరణను నిర్దేశించే ఈ వేడుకలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు.తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే మహానాడు కార్యక్రమానికి సంబంధించిన సమీక్షా సమావేశాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. మే 27 నుండి 29 వరకు జరగనున్న ఈ మహానాడు సభలను విజయవంతం చేయడానికి, పార్టీ శ్రేణులు మరియు ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే పిలుపు శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ప్రతి క్లస్టర్ నుండి నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజలు సభలో పాల్గొని విజయవంతం చేయాలని బొజ్జల సుధీర్ రెడ్డి కోరారు పార్టీ బలోపేతం మరియు భవిష్యత్తు ప్రణాళికలపై దిశానిర్దేశం కార్యకర్తలకు నియోజకవర్గ స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేసి మహానాడును విజయవంతం చేయాలి.తెలుగుదేశం పార్టీ శ్రేణులంతా ఉత్సాహంతో మహానాడుకు తరలిరావాలని ఎమ్మెల్యే బొజ్జల పిలుపునిచ్చారు. పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు నర లోకేష్ నాయకత్వంలో జరిగే ఈ ప్రతిష్టాత్మక సభను విజయవంతం చేయడం ద్వారా మన ఐక్యతను చాటాలని, రాబోయే రోజుల్లో ప్రజల పక్షాన పోరాడేందుకు ఈ వేదిక దిశానిర్దేశం చేస్తుందని ఆయన పేర్కొన్నారు.

## ప్రజ్ఞాపూర్ ఊర చెరువులో మట్టి అక్రమ రవాణాపై బీజేపీ ఆందోళన




ప్రజాప్రశ్న
ప్రజ్ఞాపూర్ ఊర చెరువుపై మట్టి మాఫియా కన్ను

గజ్వేల్ (ప్రశ్న న్యూస్)సిద్ధిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్‌లోని ఊర చెరువులో జేసీబీల సహాయంతో రాత్రికి రాత్రే అక్రమంగా మట్టిని తరలిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ 4వ వార్డ్ బీజేపీ కౌన్సిలర్ రొట్టెల శ్రీనివాస్ ఆధ్వర్యంలో గజ్వేల్ ఆర్డీవో మరియు ఎమ్మార్వోలకు వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజల ఆస్తిగా ఉన్న ఊర చెరువును కొందరు మట్టి మాఫియా స్వార్థ ప్రయోజనాల కోసం దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. చెరువులో జరుగుతున్న మట్టి అక్రమ రవాణాను వెంటనే నిలిపివేసి, ఇందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.ప్రజా వనరులను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, చెరువుల పరిరక్షణకు తక్షణ చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## యువత క్రీడలకు ప్రాధాన్యతనివ్వాలి



నాచారం(ప్రశ్న న్యూస్) యువత మద్యం మత్తు, చెడు అలవాట్లకు దూరంగా ఉండి చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని మాజీ సైనికుడు, ఎస్ఎస్ఎస్ యువసేన అధ్యక్షుడు సంతోష్ రెడ్డి అన్నారు. ప్రజ్ఞ గ్రూప్ సహకారంతో ఎస్ఎస్ఎస్ యువసేన ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు సమ్మర్ బాస్కెట్ బాల్ టోర్నమెంట్ ను నిర్వహించారు. టోర్నమెంట్ లో గెలిచిన జట్టులకు బహుమతులను అందచేశారు. ఈ సందర్భంగా సంతోష్ రెడ్డి మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించాలని క్రీడల వల్ల మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. టోర్నమెంట్ కు సహకరించి క్రీడాకారులను ప్రోత్సహించిన నాచారం పోలీస్ సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గత ఆరు సంవత్సరాలుగా సమ్మర్ బాస్కెట్ బాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని తెలిపారు.టోర్నమెంట్ కు సహకరించిన కోచ్ లకు, క్రీడాకారులకు, వాలంటరీలకు సంతోష్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

# బాల్య వివాహం బ్రతుకు ఆగం
## బాల్యవివాహాలు లేని తెలంగాణ కోసం కృషి చేద్దాం



సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) జిల్లా సంక్షేమ అధికారి ఆధ్వర్యంలో గంభీరావుపేట మండల కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాల్య వివాహం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. బాలలకు చిన్న వయసులో పెళ్లి చేయడం ద్వారా శారీరక సమస్యలు వస్తాయని మళ్లీ వారు గర్భం ధరించడం వలన వారికి శక్తిహీనతతో కూడిన రక్తహీనతతో కూడిన పోషకాహార లోపంతో కూడినటువంటి పిల్లలు జన్మించే అవకాశం ఉంటుంది వారు భవిష్యత్తులో అనేక రకాలైనటువంటి వ్యాధులకు గురి అయ్యే అవకాశం ఉంటుంది. ఇలా శారీరకపరంగా చూసినప్పుడు బాల్యవివాహాలను నివారించాలని తెలియజేశారు. అలాగే సామాజిక ఆర్థిక మానసిక అంశాలలో కూడా బాల్యవివాహాలు అనేక రకాలైన ఇబ్బందులు కలిగిస్తాయని వివరించడం జరిగింది. సిరిసిల్ల డిఎస్పి శ్రీ నాగేంద్ర చారి మాట్లాడుతూ బాల్య వివాహం చెడ్డరీత్యా నేరమని అమ్మాయిలకు 18 సంవత్సరాల వయసు అబ్బాయికి 21 సంవత్సరాలు నిండకముందు పెళ్లి చేస్తే వారికి జైలు శిక్ష రెండు సంవత్సరాలు లక్ష రూపాయల జరిమానా కు గురి అవుతారని హెచ్చరించడం జరిగింది. అలాగే ఆధార్ కార్డును పుట్టిన తేదీకి ప్రామాణికంగా తీసుకోవడం జరగదని హెచ్చరించారు. పాఠశాల నుంచి =ఇూ బర్త్ సర్టిఫికెట్స్ మాత్రమే పరిగణలోకి తీసుకుంటారని తెలియజేయడం జరిగింది. అలాగే ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పిల్లలు కెరీర్ మీద దృష్టి పెట్టాలని సూచించారు. స్నేహ క్లబ్బులు పిల్లల యొక్క ఎదుగుదలకు తోడ్పడతాయని వివరించారు. కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ లాంటి పథకాలు 18 సంవత్సరాలు నిండిన వారికే వర్తిస్తాయని సూచించారు. టోల్ ఫ్రీ నెంబర్ 1098, 181,100 24 గంటలు 365 రోజులు 65 రోజులు పని చేస్తాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఏ రకమైన ఇబ్బందులు తలెత్తిన వెంటనే కాల్ చేయాలి అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మ, సిడిపిఓ ఉమారాణి, సూపర్వైజర్ రేణుక, డిహబ్ - రోజా, డి సి పి ఓ కవిత, చైల్డ్ హెల్ప్ లైన్ సిబ్బంది వీరబోయిన సాయిరాం, అన్ని గ్రామాల సర్పంచులు అంగన్వాడీ కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

## మంత్రి శ్రీధర్ బాబును కలిసిన సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఏటి యాదవ్

**- శభాష్‌పల్లి గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించాలని వినతి**


**- శభాష్‌పల్లి ప్రగతికి నిధుల మంజూరుపై మంత్రి సానుకూల స్పందన**



వేములవాడ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబును రాజన్న సిరిసిల్ల జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు, వేములవాడ అర్బన్ మండలం, శాభాష్‌పల్లి గ్రామ సర్పంచ్ ఏటి యాదవ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబును కలిసిన ఆయన,శాభాష్‌పల్లి గ్రామంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులపై సుదీర్ఘంగా చర్చించారు. గ్రామానికి సంబంధించిన వివిధ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, వాటి పరిష్కారానికి, గ్రామాభివృద్ధికి అవసరమైన ప్రత్యేక నిధులను తక్షణమే కేటాయించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. నిధుల మంజూరుపై మంత్రి శ్రీధర్ బాబు సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఏటి యాదవ్, గ్రామాల ప్రగతికి ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని ఈ సందర్భంగా కొనియాడారు. ?అనంతరం సర్పంచ్ ఏటి యాదవ్ మాట్లాడుతూ,శాభాష్‌పల్లి గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో నెలకొన్న మౌళిక వసతుల సమస్యలను పరిష్కరించేందుకు, కొత్త అభివృద్ధి పనులను చేపట్టేందుకు నిధుల కొరత లేకుండా చూస్తామని మంత్రి శ్రీధర్ బాబు హామీ ఇచ్చారని పేర్కొన్నారు. నియోజకవర్గ, జిల్లా పరిధిలోని ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంలో తమ వంతు కృషి ఎల్లప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు. గ్రామాభివృద్ధికి సానుకూలంగా స్పందించిన మంత్రికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## డ్రగ్స్, గంజాయి నిర్మూలనకు ప్రత్యేక తనిఖీలు

**మత్తు పదార్థాల విక్రయాలు, రవాణాపై కఠిన చర్యలు తప్పవు**



ఎల్లారెడ్డిపేట( ప్రశ్న న్యూస్) కిరాణా, పాన్ షాప్స్, బస్టాండ్ పరిసర ప్రాంతాలలో డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణా మరియు విక్రయాలను అరికట్టేందుకు ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసు అధికారులు నార్కోటిక్ సహాయంతో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు, బ్యాగులను క్షుణ్ణంగా తనిఖీ చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. జిల్లాలో మత్తు పదార్థాల నిర్మూలనకు పోలీసులు నిరంతరం ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని, గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల విక్రయాలు, వినియోగంపై సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని అన్నారు. ప్రజల సహకారంతోనే మత్తు పదార్థాల నిర్మూలన, భద్రతా చర్యలు మరింత సమర్థవంతంగా కొనసాగుతాయని అధికారులు తెలియజేశారు.

## ఐకేపీ,విఓఏల నిరవధిక సమ్మెకు ఏఐటీయూసీ సంపూర్ణ మద్దతు

**- ఐకేపీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలి**

**- ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి : కడారి రాములు**



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్, అర్బన్ మండలాల ఐకేపీ,విఓఏల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరవధిక సమ్మెకు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు సంపూర్ణ సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఐకేపీ, విఓఏలు చాలీచాలని వేతనాలతో జీవనం సాగిస్తున్నారని, ఉద్యోగ భద్రత లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రోజురోజుకు పనిభారం పెరుగుతున్నప్పటికీ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు.తక్షణమే ఐకేపీ,విఓఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఆన్‌లైన్ విధానాల నిర్వహణ కోసం ట్యాబ్‌లు,నెట్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే వారిని సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి హ్యూమన్ రిసోర్స్ పాలసీ అమలు చేయాలని, అర్హత కలిగిన విఓఏలకు సీసీ లుగా పదోన్నతులు ఇవ్వాలని కోరారు.విఓఏలకు రూ.20 లక్షల సాధారణ, ఆరోగ్య భీమా సౌకర్యం కల్పించడంతో పాటు జీఓ నెంబర్ 58ను సవరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## మహానాడును ఇంటి పండుగలా నిర్వహిస్తాం:మంత్రి నారాయణ

**గోమతినగర్ క్యాంపు కార్యాలయంలో సిటీ పార్టీ నేతలతో సమీక్ష**



నెల్లూరు (ప్రశ్న న్యూస్) భారత ప్రధాని నరేంద్ర మోదీ పిలుపుమేరకు ఇంధన పొదుపులో భాగంగా ఈ ఏడాది వర్చువల్ గా జరగనున్న మహానాడును ఇంటి పండగలా నిర్వహించాలని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పిలుపునిచ్చారు. బుధ, గురువారం రెండురోజుల పాటు నిర్వహించనున్న మహానాడు పై గోమతినగర్ క్యాంపు కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు.వర్చువల్ గా తొలిసారి నిర్వహిస్తున్న మహానాడును విజయవంతం చేసేందుకు కృషిచేయాలని సూచించారు.సిటీ నియోజక వర్గంలోని 14 క్లస్టర్లలో మహానాడు ఏర్పాట్లపై సమీక్షించి దిశా నిర్దేశం చేశారు.ప్రతీ చోటా ఎల్ఈడి వాల్స్ ఏర్పాటు చేయాలని, మహానాడులో పాల్గొనే కార్యకర్తలు,అభిమానులు,శ్రేయోభిలాషులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు.రెండురోజుల పాటు పార్టీ పెద్దలు,ముఖ్యనేతలు ఇచ్చే సందేశాలను విని చేసిన అభివృద్ధిని,ఇచ్చిన సంక్షేమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో మహానాడు నెల్లూరు సిటీ అబ్జర్వర్ గురవారెడ్డి,రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ తాళ్ళపాక అనూరాధ, మాజీ జడ్పిటిసి విజేతారెడ్డి,బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ధర్మవరం సుబ్బారావు, కార్పొరేటర్లు, క్లస్టర్, కో క్లస్టర్ ఇంచార్జిలు,టీడీపీ ముఖ్య నేతలు పాల్గొన్నారు.

## టిడిపి కేంద్ర కార్యాలయంలో మహానాడు ఏర్పాట్లును పరిశీలించిన: మంత్రులు

**ఈసారి క్షేత్రస్థాయిలో అంగరంగ వైభవంగా**

**మహానాడుని నిర్వహిస్తున్నాం**

**పొదుపు చర్యల్లో భాగంగా మహానాడుకు**

**మహర్దశ వచ్చింది :హోం మంత్రి అనిత**




మంగళగిరి( ప్రశ్న న్యూస్)తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో మహానాడు ఏర్పాట్లను హోం మంత్రి అనిత, మంత్రులు పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, సవిత, గొట్టిపాటి రవికుమార్ మంగళవారం పరిశీలించారు.ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడుతూ..ఈసారి మహానాడు పండుగ హైబ్రిడ్ విధానంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పశ్చిమ ఆసియాలో జరుగుతున్న యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో పొదుపు చర్యల్లో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు సీఎం చంద్రబాబు నాయుడు దూరదృష్టితో మహానాడును హైబ్రిడ్ రూపంలో నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. మంత్రి నారా లోకేష్ తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత జరుగుతున్న తొలి మహానాడు ఇదేనని తెలిపారు. మొదట మహానాడును నెల్లూరులో నిర్వహించాలని భావించినప్పటికీ, ఈసారి మరింత వైభవంగా క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్నామని చెప్పారు. లోకేష్ నాయకత్వంలో పార్టీకి అనేక విప్లవాత్మక మార్పులు వచ్చాయని, టెక్నాలజీని వినియోగించి గ్రామ, నియోజకవర్గ స్థాయిలో కూడా నాయకులు, కార్యకర్తలు ప్రత్యక్షంగా మహానాడును వీక్షించేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో సుమారు ఐదు వేల మంది కార్యకర్తలు, నాయకులు పాల్గొంటూ మహానాడును వీక్షిస్తున్నారని వెల్లడించారు. పొదుపు చర్యలతో పాటు పార్టీకి కొత్త దిశను చూపించే విధంగా మహానాడు నిర్వహిస్తున్నామని, నవశకానికి నాంది పలికే తొలి అడుగుగా ఈ మహానాడు నిలుస్తుందని హోంమంత్రి పేర్కొన్నారు. ఈసారి "స్త్రీ శక్తి" నినాదంతో పాటు యువతకు ఉద్యోగ అవకాశాల కల్పనే ప్రధాన లక్ష్యంగా మహానాడు కొనసాగుతుందని ఆమె స్పష్టం చేశారు.

# భగత్ సింగ్ నగర్ ప్రజలకు తాగునీటి సమస్య నుంచి శాశ్వత పరిష్కారం!

**కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్**



కొత్తగూడెం (ప్రశ్న న్యూస్) కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని 12వ డివిజన్, భగత్‌సింగ్‌నగర్ ప్రజలకు తాగునీటి సమస్యల నుంచి శాశ్వత ఉపశమనం కల్పించే దిశగా కీలక చర్యలు కొనసాగుతున్నాయని కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ పేర్కొన్నారు. మంగళవారం ఈ క్రమంలో ఏర్పాటు చేసిన మూడు నూతన బోర్లను కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మూడ్ గణేష్ మాట్లాడుతూ, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సహకారంతో కొత్తగూడెం పట్టణ అభివృద్ధికి మరిన్ని ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా 12వ డివిజన్, భగత్‌సింగ్‌నగర్ ప్రజలకు తాగునీటి సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కార చర్యలు కొనసాగిస్తామని పేర్కొన్నారు. అలాగే "ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, ఏ సమస్య వచ్చినా ముందుండి పరిష్కరిస్తానని ప్రజాసేవే నా ధ్యేయం" అని మేయర్ మూడ్ గణేష్ హామీ ఇచ్చారు. చాలా కాలంగా నీటి సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రాంతాల్లో అత్యంత వేగంగా స్పందించి మూడు కొత్త బోర్లను ఏర్పాటు చేయించిన మేయర్ గణేష్ పై డివిజన్ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించే నాయకత్వం అరుదుగా కనిపిస్తుందని, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సహకారం, మేయర్ గణేష్ ప్రత్యేక చొరవతో తమ సమస్యకు తక్షణ పరిష్కారం లభించిందని స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ టౌన్ అధ్యక్షుడు కే. జమలయ్య , 12వ డివిజన్ కార్పొరేటర్ నాగలక్ష్మి , సీనియర్ నాయకులు నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు , 11వ డివిజన్ సిపిఐ నాయకులు భవాని ప్రసాద్ , 12వ డివిజన్ సిపిఐ నాయకులు సాంబ , 53వ డివిజన్ సిపిఐ పార్టీ కార్పొరేటర్ బండి నరసింహారావు, 49వ డివిజన్ సిపిఐ పార్టీ కార్పొరేటర్ విజయ్ కుమార్, 12వ డివిజన్ భగత్‌సింగ్‌నగర్ ప్రజలు, కొత్తగూడెం కార్పొరేషన్ మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# జీఓ 17 రద్దు కోసం చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**- ఎస్సీ,ఎస్టీ,మైనార్టీ జేఏసీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జి : కొంకటి శేఖర్ పిలుపు**



కరీంనగర్ (ప్రశ్న న్యూస్) కరీంనగర్‌లో ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జి కొంకటి శేఖర్ మాట్లాడుతూ,ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీలకు నష్టం కలిగించే జీఓ 17ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం స్థానికులకు గురుకుల టెండర్లు ఇచ్చి నిరుద్యోగ సమస్యను తగ్గించే ప్రయత్నం చేసిందని, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం స్థానికేతరులకు టెండర్లు కట్టబెట్టేందుకు కుట్ర చేస్తోందని ఆరోపించారు. జీఓ 17కు నిరసనగా ఈ నెల 30న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద భారీ ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు పెద్దపల్లి, సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. వేసవి పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని తగిన జాగ్రత్తలు తీసుకుంటూ కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కో-కన్వీనర్ జన్ను స్వరూప్, ఫిఫ్ రాష్ట్ర కార్యదర్శి దుస్సా కుమారస్వామి, కరీంనగర్ జిల్లా ఇంచార్జి మేకల రవీందర్, పెద్దపల్లి జిల్లా ఇంచార్జి మోలుమూరి శేఖర్, బీసీ సంఘం నాయకులు ఉరుమల్ల విశ్వం, ఆకెనపల్లి శిరీష, స్వేరో జిల్లా అధ్యక్షుడు జెట్టపల్లి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# ఎర్ర పోచమ్మ గుడి వద్ద నూతన బోరుకు మోటార్ ఏర్పాటు

**ఇమ్మడి శివలక్ష్మి, జహంగీర్**



గజ్వేల్ (ప్రశ్న న్యూస్) జగదేవపూర్ మేజర్ గ్రామానికి చెందిన ఎస్సీ సంఘ సభ్యులు నిర్మించిన ఎర్ర పోచమ్మ నూతన దేవాలయం వద్ద తాగునీటి సౌకర్యం కోసం బోరు వేయించాలని ఇమ్మడి శివలక్ష్మి -- జహంగీర్ దంపతులను కోరగా, వారు స్పందించి ఈ నెల 20వ తేదీన నూతన బోరును వేయించారు. ఎర్ర పోచమ్మ తల్లి దయతో బోరులో సమృద్ధిగా నీరు రావడంతో గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.తాజాగా బోర్ బావిలో మోటార్‌ను కూడా ఏర్పాటు చేయడం జరిగింది. దీంతో ఆలయానికి వచ్చే భక్తులకు, స్థానికులకు తాగునీటి సమస్య తీరిందని గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా బోర్ మోటార్ ఏర్పాటు చేసి తమ దాహార్తిని తీర్చిన ఇమ్మడి శివలక్ష్మి -- జహంగీర్ గార్లకు ఎస్సీ కుల సంఘ నాయకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కొత్త దయాకర్ రెడ్డి, కొంపెల్లి కరుణాకర్, అమర రాము, తాటిపాముల ఆంజనేయులు, ఎండీ అజీజ్, దండే వెంకటేష్, వద్ది సాయి కుమార్, ఎస్సీ కుల సంఘ నాయకులు, జగదేవపూర్ పట్టణ కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ వార్డు సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఏసీబీకి అడ్డంగా దొరికిన శామీర్‌పేట్ ఎమ్మార్వో

**- ఎకరానికి రూ.లక్ష చొప్పున రూ.30 లక్షలకు బేరం**

- **భూ కన్వర్షన్ కోసం ఎమ్మార్వో లంచం డిమాండ్**
- **రూ.2 లక్షలు తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ**
- **సరిగ్గా రెండేళ్ల కిందట కూడా ఇటువంటి ఘటన**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) అవినీతి నిరోధక శాఖ ( ఏసీబీ ) అధికారుల వలకు మరో భారీ తిమింగలం చిక్కింది. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా శామీర్‌పేట్ ఎమ్మార్వో ఆఫీసులో ఏసీబీ అధికారులు మంగళవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఓ బాధితుడి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన ఏసీబీ ఎమ్మార్వో



సుచరిత ఆఫీసులో సోదాలు చేపట్టింది. ఈ క్రమంలో బాధితుడి నుంచి ఆమె కారు డ్రైవర్ పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకుని, వాటిని సుచరితకు అందిస్తుండగా ఏసీబీ అధికారులు పక్కా సమాచారంతో దాడి చేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన దాదాపు రూ. 30 లక్షల



భారీ లావాదేవీలకు సంబంధించిన కేసులో ఈ దాడులు నిర్వహించారు. ఎమ్మార్వో సుచరితతో పాటు ఆమె కారు డ్రైవర్‌ను కూడా ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. రంగారెడ్డి ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ నేతృత్వంలో ఈ దాడులు నిరర్వహించారు. సోదాల అనంతరం మీడియా సమావేశంలో ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ వివరాలను వెల్లడించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ శామీర్‌పేట మండలం ఆలియాబాద్ ప్రాంతంలో సుమారు 30 ఎకరాల భూమి కన్వర్షన్‌కు సంబంధించి రైతు కన్సల్టెంట్ నుంచి భారీ మొత్తంలో లంచం డిమాండ్ చేసినట్లు ఫిర్యాదు వచ్చిందని చెప్పారు. ఫిర్యాదు ఆధారంగా విచారణ చేపట్టామని, ఎకరానికి రూ.లక్ష చొప్పున మొత్తం రూ.30 లక్షలు డిమాండ్ చేసినట్లు ప్రాథమికంగా తేలిందని తెలిపారు. ఈ వ్యవహారంలో తహసీల్దార్ సుచరిత.. డ్రైవర్ ద్వారా రూ.2 లక్షలు తీసుకుంటుండగా పట్టుకున్నామని అన్నారు. ఎమ్మార్వో ఆఫీసులో కీలక పత్రాలు, భూకన్వర్షన్‌కు సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకున్నామని అన్నారు. వీటి పరిశీలించి, ఎమ్మార్వో సుచరిత, ఆర్డీఓ కీసర రాజేష్ సహా పలువురు సిబ్బందిని విచారిస్తున్నామని తెలిపారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని ఏసీబీ అధికారులు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, రెండేళ్ల కిందట కూడా శామీర్‌పేట ఎమ్మార్వో సత్యనారాయణ రూ.2 లక్షల లంచం కేసులో డ్రైవర్‌తో కలిసి ఏసీబీకి పట్టుబడిన ఘటన అప్పట్లో సంచలనం సృష్టించింది. తాజాగా మరోసారి అదే ఎమ్మార్వో ఆఫీసులో ఏసీబీ దాడులు జరగడం చర్చనీయాంశంగా మారింది.

# మిలిటెంట్ దాడులు చేద్దాం, ఆఫీసుల్ని తగులబెడదాం

**- బాల్క సుమన్ సంచలన వ్యాఖ్యలు**

- **మిలిటెంట్ యాక్టివిటీ ప్లాన్ చేయండి**
- **అవసరమైతే జైలుకు వెళ్లి రండి**
- **బీఆర్ఎస్ నేత బాల్క సుమన్ సంచలన వ్యాఖ్యలు**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) బీఆర్ఎస్ నేత, చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ భవన్‌లో మంగళవారం నిర్వహించిన తెలంగాణ బొగ్గు గని కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీబీజీకేఎస్‌కు కోల్ బెల్ట్ ఏరియాలో పూర్వ వైభం రావాలంటే ప్రెస్ మీట్లు పెట్టడం కాదు, మీటింగ్‌లు పెట్టడం, సోషల్ మీడియాలో పోస్టులు చేయడం కాదు మిలిటెంట్ యాక్టివిటీ చేయాలంటూ వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. అవసరమైతే సింగరేణి భవన్‌ను తగలబెట్టాలని ఆయన పిలుపునిచ్చారు."మందమర్రి డివిజన్లో ప్రోగ్రా పెట్టుర్రి జీఎం ఆఫీసు కాలబెడదం. పోతేపోయింది ఓ నెల రోజులు పోయొత్తం. గోదావరిఖనిలో ఓ ప్రోగ్రాం పెట్టుర్రి ఈశ్వరన్నను ముందుపెట్టుర్రి కొత్తగూడెంలో రవనన్న ముందు పెట్టుర్రి కార్మికులు మనల్ని ఓన్ చేసుకోవాలె. వీళ్లు మన కోసం తన్లాడుతున్నరు, కొట్లాడుతున్నరు, లాఠీఛార్జీలు అవుతున్నయ్, కష్టపడుతున్నారు, కేసులు అయితున్నయ్, ఇబ్బందులు అయితున్నయ్ మా కోసం కొట్లాడినందుకు వీళ్లను ఈ డివిజన్ నుంచి ఆ డివిజన్‌కు ట్రాన్స్‌ఫర్ చేసి పారేశిర్రు వీళ్లను జైళ్ల బెట్టిర్రు అని వాళ్లకు ఫీలింగ్ రావాలె. మన సంఘం మీద, నాయకత్వం మీద ఓనర్‌షిప్ మీద రావాలె" అని బాల్క సుమన్ వ్యాఖ్యానించారు."మన ఏరియాల గన్ని రైల్వే లైన్లు ఉన్నయ్. కోసిపారేయిర్రి ఒక రోజు. రైలు రోకో అని పెట్టి రైలును కోసి పారేయిర్రి సీరియస్‌గా జెప్తున్నా. నేను అనే పాయింట్ ఏందంటే మీరు సీరియస్ యాక్టివిటీ తీసుకుంటే తప్పా మీ దిక్కు కార్మిక వర్గం తిరిగి చూడదు. నేను చెప్పేది వాస్తమా కాదా మీరే ఆలోచించుకోండి. కాంగ్రెస్ మూడేళ్ల పాలనలోకి అడుగుపెట్టింది. ఇప్పుడు గట్టిగ కొట్లాడితే ఎంత గట్టిగ మాట్లాడితే మంచిది ఆందోళనలు, రాస్తారోకోలు, రైలు రోకోలు సప్ప సప్పగ చేస్తే నడవదు. కొంచెం గట్టిగ చేయాలె. గట్టిగ జేస్తే మన దిక్కు తిరిగి చూస్తరు, మనల్ని ఓన్ చేసుకుంటరు, మన దిక్కు అస్తరు. పోయి రండి ఓ 45 రోజులు జైలుకు. జైలుకు పోయి వస్తే ఓ కేసు అయితే గోల్డ్ మెడల్ వచ్చినట్లు ఫీల్ కావాలి తప్పితే భయపడొద్దు" అని బీఆర్ఎస్ నేత పిలుపునిచ్చారు.
"మిలిటెంట్ యాక్టివిటీతో మనల్ని ఆ వర్గం ఓన్ చేసుకుంటుంది. వీళ్లను ఓడగొట్టినం, ఎమ్మెల్యేలను ఓడగొట్టినం, ప్రభుత్వాన్ని పోగొట్టినం. అయిన కూడా వీళ్లు మనసులో పెట్టుకోకుండా మన కోసం కొట్లాడుతున్నారు. వీళ్లే మన బిడ్డలు, కాంగ్రెస్, బీజేపీ పరాయి వాళ్లు అనే ఫీలింగ్ కార్మిక లోకాని వస్తది. కాబట్టి



మిలిటెంట్ యాక్టివిటీని కూడా సీరియస్‌గా తీసుకోవాలె. అవసరమైతే సింగరేణి భవన్‌ను కాలబెట్టండి. ఆ సీరియస్‌నెస్ యాక్టివిటీలో కనబడితే తప్పితే కార్మికులు మనవైపు రారు. వడ్ల కొనుగోలు సమస్య విషయంలో రైతులు రోడ్ల మీదకు రావడం లేదు. భీమారంలో హైవే దిగ్బంధిస్తే ఐదుగురే రైతులు వచ్చారు. మిగతా 60-70 మంది మనోళ్లే. చెన్నూరులో కిష్టంపేట దగ్గర జాతీయ రహదారి మీద కూర్చుంటే నలుగురైదుగురే రైతులు, మిగతా 100 మంది మనోళ్లే. ఎవరూ వస్తలేరు. ధైర్యంగా ఎవరూ ముందుకు రావడం లేదు. వాళ్లు బయటకు రావాలంటే మనం మిలిటెంట్ యాక్టివిటీకి రూపకల్పన చేయాలె. దీని వల్ల మనకు దూరమైన వర్గాలు దగ్గరయితయి. అలుగుడు, గులుగుడు మొత్తం పీకుతయి. సంఘంలో రాజకీయాలు తగ్గుతయ్" అని బాల్క సుమన్ వ్యాఖ్యానించారు.

# గంగాధర కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా మంత్రి మహేందర్

- **ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నాయకత్వంలో పార్టీ బలోపేతమే లక్ష్యం**
- **ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తా**
- **కాంగ్రెస్ పార్టీ నూతన మండలాధ్యక్షులు : మంత్రి మనోహర్**



గంగాధర (ప్రశ్న న్యూస్) చొప్పదండి నియోజకవర్గం,కరీంనగర్ జిల్లా, గంగాధర మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా మంత్రి మహేందర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చొప్పదండి నియోజకవర్గంలో అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నిలుస్తున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే సత్యం నాయకత్వంలో గంగాధర మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృతంగా ప్రచారం చేస్తామని మంత్రి మహేందర్ అన్నారు. పార్టీ శ్రేణులు, కార్యకర్తల సమన్వయంతో మండలంలో కాంగ్రెస్ పార్టీకి మరింత బలం చేకూరుస్తామని తెలిపారు.తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే,కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ మేడిపల్లి సత్యంకు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు మంత్రి మహేందర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# నిబంధనలకు అనుగుణంగా సిబ్బంది బదిలీల ప్రక్రియ

**- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**



సిరిసిల్ల( ప్రశ్న న్యూస్) రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న సిబ్బంది బదిలీల ప్రక్రియను నిబంధనలు అనుగుణంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధ్యక్షతన నిర్వహించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన ఈ బదిలీల ప్రక్రియలో ముందుగా ఆయా ప్రభుత్వ శాఖల కార్యాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది వివరాలను సంబంధిత జిల్లా అధికారులు కలెక్టర్ కు అందజేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్న స్థానం నుండి ఇతర స్థానాలకు పారదర్శకంగా సిబ్బందిని బదిలీ చేశామని కలెక్టర్ తెలిపారు. ఈ ప్రక్రియలో ఆయా శాఖల జిల్లా స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సిద్ధిపేట జిల్లా ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్‌గా మల్కగల్ల కరుణాకర్ నియామకం

**కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్న కరుణాకర్**



గజ్వేల్ (ప్రశ్న న్యూస్) ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో జరిగిన కార్యక్రమంలో సిద్ధిపేట జిల్లా ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్‌గా మల్కగల్ల కరుణాకర్ నియామక పత్రాన్ని అందుకున్నారు. జాతీయ ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ రాజేంద్ర పాల్ గౌతమ్, తెలంగాణ ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ కవ్వంపల్లి సత్యనారాయణ, తెలంగాణ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరిగారి ప్రీతం సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మల్కగల్ల కరుణాకర్ మాట్లాడుతూ పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు కట్టుబడి పనిచేస్తానన్నారు. ఎస్సీ వర్గాల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వం మరియు కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న కార్యక్రమాలను గ్రామ స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు.జిల్లాలోని ఎస్సీ యువతకు విద్య, ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా పనిచేస్తానని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, సమాన హక్కుల సాధన కోసం ఎస్సీ సెల్‌ను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నిరంతరం శ్రమిస్తానని స్పష్టం చేశారు.
తనకు ఈ బాధ్యత అప్పగించిన జాతీయ ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ రాజేంద్ర పాల్ గౌతమ్, తెలంగాణ ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ కవ్వంపల్లి సత్యనారాయణ, తెలంగాణ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరిగారి ప్రీతం, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి మరియు రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వానికి కరుణాకర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎస్సీ డిపార్ట్మెంట్ ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 'సాతాన్: ది డార్క్' మూవీ రివ్యూ!



ఓటీటీలలో హారర్ థ్రిల్లర్ సినిమాలకు మంచి డిమాండ్ ఉంది. అందువలన హారర్ థ్రిల్లర్ జోనర్ కి సంబంధించిన కథలను ఫ్లాట్ ఫామ్ పై దింపడానికి ఓటీటీలు పోటీపడుతూ ఉంటాయి. అలా రీసెంటుగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన సినిమానే 'సాతాన్: ది డార్క్'. తమిళంలో రూపొందిన ఈ సూపర్ నేచురల్ హారర్ థ్రిల్లర్, మార్చి 27వ తేదీన థియేటర్లకు వచ్చింది. ఈ నెల 8వ తేదీ నుంచి 'అమెజాన్ ప్రైమ్'లో .. ఈ నెల 20వ తేదీ నుంచి 'ఆహా తమిళ్' లో స్ట్రీమింగ్ అవుతోంది.

అది ఒక కొండ ప్రాంతం. ఆ కొండ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న ప్రదేశంలో కొన్ని గ్రామాలవారు నివసిస్తూ ఉంటారు. అలీషా (ఐరా) తన తల్లి మెర్సిలిన్ (మోనా బెద్రే) చెల్లెలితో కలిసి నివసిస్తూ ఉంటుంది. అలీషా చిన్నతనంలో తమ ఇంటి చీకటి గదిలో నుంచి అరుపులు .. కేకలు రావడాన్ని వింటూ ఉండేది. లోపల ఉన్నది 'విక్టోరియా' అనే విషయం ఆమెకి గుర్తుంటుంది. వాళ్లు నివసించే ఇంటికి కాస్త దూరంలో 'సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్' ఉంటుంది. ఆ స్కూల్లో అలీషా 12వ క్లాస్ చదువుతూ ఉంటుంది. అదే క్లాస్ కు చెందిన సాగర్ (ఫ్రెడ్రిక్ జాన్) అలీషాను ప్రేమిస్తూ ఉంటాడు. కొంతకాలంగా మెర్సిలిన్ చిత్రంగా ప్రవర్తించడం మొదలుపెడుతుంది. ఏదో క్షుద్రశక్తి తనని ఆవహించినట్టుగా, తానేం చేస్తున్నది తెలియని స్థితికి వెళ్లిపోతూ ఉంటుంది. ఆమె విపరీత ధోరణి ఇద్దరు కూతుళ్లను భయభ్రాంతులకు గురిచేస్తూ ఉంటుంది. తనని తాను గాయపరచుకోకుండా ఆమెను కాపాడుకోవడానికి అలీషా నానా తంటాలు పడుతూ ఉంటుంది. ఆ ప్రయత్నంలో తల్లి కారణంగా అలీషా గాయపడుతూ ఉంటుంది. మెర్సిలిన్ ను స్కూల్ కి రానీయవద్దని అలీషాకి సిబ్బంది చెబుతుంది.

అలీషా ఏదో కోల్పోయినట్టుగా ఉండటం .. హాస్పిటల్ పాలవుతూ ఉండటం ఆమె లవర్ సాగర్ ను ఆలోచనలో పడేస్తుంది. ఏదో క్షుద్రశక్తి అలీషా కుటుంబాన్ని ఇబ్బంది పెడుతుందనే విషయాన్ని అతను గ్రహిస్తాడు. ఆ శక్తి ఆమె ఇంట్లోనే ఉందనీ, అదేమిటో తెలుసుకోవాలని భావిస్తాడు. అలీషా హాస్పిటల్లో ఉండగా, తన స్నేహితుడైన మురళిని వెంటబెట్టుకుని ఆమె ఇంటికి వెళతాడు. అక్కడ ఏం జరుగుతుంది? సాతాన్ బారి నుంచి అతను అలీషాను కాపాడుకోగలుగుతాడా? అనేది మిగతా కథ. 'సాతాన్' అంటే 'సైతాన్' అని అర్థం. సైతాన్ అంటే ఒక దుష్టశక్తి. క్షుద్రశక్తులను వశపరచుకున్నవారు మాత్రమే వాటిని ఆదేశించగలరు .. నియంత్రించగలరు. ఎదుటివారిపై విజయం సాధించడం కోసం .. స్వార్థపూరితమైన తమ కోరికలను నెరవేర్చుకోవడం కోసం క్షుద్రశక్తులను ఆశ్రయించేవారు ఎక్కువగా కనిపిస్తూ ఉంటారు. అలా ఒక క్షుద్రశక్తిని ఆరాధించేవారి చుట్టూ, వారి బాధితుల చుట్టూ ఈ కథ తిరుగుతుంది. సాధారణంగా దుష్టశక్తి ఆవహించిన కూతురును కాపాడుకోవడం కోసం ఒక తల్లి ఆరాటపడే సినిమాలు, గతంలో ఈ జోనర్ నుంచి చాలానే వచ్చాయి. అయితే అందుకు భిన్నంగా దుష్టశక్తి నుంచి తన తల్లిని రక్షించుకోవడం కోసం కూతురు తపించిపోవడం కొత్తగా అనిపిస్తుంది. తల్లీకూతుళ్ల మధ్య డిజైన్ చేసిన సన్నివేశాలు అక్కడక్కడా భయపెడతాయి. తాంత్రిక పూజలు .. దుష్టశక్తి .. తల్లీకూతుళ్ల కాంబినేషన్ లోని సన్నివేశాలు చాలా కాలంగా చూస్తూ వచ్చినవే. అయితే దర్శకుడు అలా ఈ కంటెంట్ రొటీన్ అనిపించకుండా జాగ్రత్తలు తీసుకునే ప్రయత్నాలు చేశాడు. ఆ విషయం మనకి ఈ కథ ఆరంభంలోనే అర్థమైపోతుంది. 16వ శతాబ్దంలో ఈస్ట్ ఇండియా కంపెనీవారి కాలంలో ఈ కథ మొదలవుతుంది. అక్కడి నుంచి ఈ కథ తాంత్రిక పూజల వైపు ఎలా వెళ్లింది? అప్పట్లో జరిగిన క్షుద్రపూజలకు .. ఇప్పుడు జరుగుతున్న విపరీతలకు సంబంధం ఏమిటి? అనే దిశగా ఈ కథను నడిపించారు. ఈ కథలో 'విక్టోరియా' అనే పాత్రనే చాలా కీలకమైనదిగా మొదటి నుంచి మనకి అర్థమైపోతూ ఉంటుంది. దాదాపు ప్రీ క్లైమాక్స్ లోనే ఆమె పాత్ర తెరపైకి వస్తుంది. ఆమె పాత్రకి సంబంధించిన ఫ్లాష్ బ్యాక్ ఇంట్రెస్టింగ్ గానే అనిపిస్తుంది. ఈ సినిమా మొదలైన దగ్గర నుంచి ఆడియన్స్ ను వెంటాడే సందేహాలకు ఈ ఫ్లాష్ బ్యాక్ లోనే సమాధానాలు దొరుకుతాయి. ఈ సినిమాలో చాలానే పాత్రలు కనిపిస్తాయి. అయితే ప్రధానమైన పాత్రలలో కనిపించే మోనా బెద్రే .. ఐరా .. చాందినీ తమిళరసన్ నటన హైలైట్ గా నిలుస్తుంది. మిగతా పాత్రలకు అంతగా ప్రాధాన్యత కనిపించదు. బాలాజీ రామస్వామి ఫొటోగ్రఫీ బాగుంది. లొకేషన్స్ ను కవర్ చేసిన విధానం ఆకట్టుకుంటుంది. అశ్విన్ కృష్ణ నేపథ్య సంగీతం కూడా ఈ కంటెంట్ కి హెల్ప్ అయింది. రాజ్ కుమార్ ఎడిటింగ్ ఫరవాలేదు. ఈ కథను 16వ శతాబ్దంలో నుంచి మొదలు పెట్టిన తీరు ఆసక్తిని రేకెత్తిస్తుంది. ఆ తరువాత ఒక వైపున కాలేజ్ .. మరో వైపున చర్చ్ .. ఇంకో వైపున కాకుల దాడి .. ఇలా కొన్ని వైపుల నుంచి ప్రేక్షకులను భయపెట్టడానికి దర్శకుడు ప్రయత్నించాడు. అయితే ఆడియన్స్ దుష్ట శక్తుల కంటే కూడా రక్తపాతానికి ఎక్కువగా భయపడతారేమో అనిపిస్తుంది. 16వ శతాబ్దంతో కథను ఎత్తుకోవడం ఉత్కంఠను పెంచినప్పటికీ, ఈ మాత్రం దానికి అక్కడి నుంచి కథను ఎత్తుకోవడం అవసరమా? అని ఆ తరువాత అనిపిస్తుంది. విక్టోరియా ఫ్లాష్ బ్యాక్ మినహా, మరే విషయమూ అంతగా ప్రభావితం చేయలేకపోతుంది. ఈ రెండు అంశాలను పక్కన పెడితే, మిగతా కథ అంతా చాలా రొటీన్ గా అనిపిస్తుంది. నాలుక కోసేయడం .. కళ్లు పీకేయడం .. చిన్నపిల్లలను 'బలి' ఇవ్వడం వంటి సన్నివేశాలు చాలా దారుణంగా అనిపిస్తాయి. హింసను తప్ప, భయపెట్టడానికి ఇతర కోణాలను .. మార్గాలను అన్వేషించలేకపోయిన కంటెంట్ ఇది.

# 'పెద్ది' ప్రమోషన్స్

## - 'దేశీ ప్రిన్సెస్'లా మెరిసిపోయిన జాన్వీ!

బాలీవుడ్ యువ నటి జాన్వీ కపూర్ తన ఫ్యాషన్ సెన్స్‌తో మరోసారి అందరినీ ఆశ్చర్యపరిచారు. బెంగళూరులో తన తాజా చిత్రం 'పెద్ది' ప్రమోషన్లలో భాగంగా ఆమె ధరించిన ఒక ప్రత్యేకమైన డ్రెస్ ఇప్పుడు సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. సాంప్రదాయ బెనారసీ వస్త్రానికి ఆధునిక హంగులు జోడించి రూపొందించిన గౌనులో జాన్వీ అచ్చం 'దేశీ ప్రిన్సెస్' (భారతీయ యువరాణి)లా మెరిసిపోయారు.సాధారణంగా బెనారసీ అంటే చీరనే గుర్తుకువస్తుంది. కానీ, జాన్వీ దానికి భిన్నంగా స్ట్రాప్‌లెస్ గౌనును ఎంచుకున్నారు. కార్సెట్ తరహా బాడీస్‌తో, ఫిట్‌గా ఉండే ఈ గౌను ఆమె అందాన్ని మరింత పెంచింది. లేత గులాబీ, మింట్, ఐవరీ వంటి పాస్టెల్ రంగుల కలయిక, బంగారు వర్ణంతో నేసిన పూల డిజైన్లు ఈ డ్రెస్‌కు ప్రత్యేక ఆకర్షణను తెచ్చిపెట్టాయి. దీనికి జతగా చేతులపై కప్పుకున్న షీర్ పాస్టెల్ దుపట్టా రాజసమైన లుక్‌ను ఇచ్చింది.ఈ డ్రెస్‌కు తగ్గట్టుగా ఆక్సీడైజ్డ్ సిల్వర్ జుంకాలు, స్టేట్‌మెంట్ ఇయర్ కఫ్ వంటి మినిమల్ యాక్సెసరీస్ ధరించారు. నుదుట పాపిడితో వేసిన స్లీక్ బన్, గ్లోయీ మేకప్‌తో తన లుక్‌ను పూర్తిచేశారు. ఇటీవలే పర్పుల్ లెహంగాతో వైరల్ అయిన జాన్వీ, ఇప్పుడు ఈ బెనారసీ గౌనుతో సంప్రదాయ వస్త్రకళకు, ఆధునిక ఫ్యాషన్‌కు మధ్య అద్భుతమైన బ్యాలెన్స్ ఎలా సాధించవచ్చో నిరూపించారు.



# యువతరం మెచ్చే వన్‌సైడ్ ప్రేమకథ



యువ నటుడు హర్షిత్‌రెడ్డి కథానాయకుడిగా రూపొందుతున్న యువతరం ప్రేమకథ 'దీవాన'. స్నేహా మణిమేఘలై కథానాయిక. శ్రీకాంత్ సంగిశెట్టి దర్శకుడు. వాసుదేవ్ కొప్పినేని, శ్రీదేవి కార్యంపూడి నిర్మాతలు. ప్రతిష్టాత్మక గీతా ఫిల్మ్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా జూన్ 19న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల కానున్నది. ఈ విషయాన్ని తెలియజేస్తూ సోమవారం ఓ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. వన్‌సైడ్ లవ్‌స్టోరీగా ఈ సినిమా తెరకెక్కుతున్నదని మేకర్స్ చెబుతున్నారు. ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై మంచి క్రేజ్ ఏర్పడిందని, యువతరాన్ని ఉర్రూతలూగించే కథ, కథనాలతో ఈ సినిమా రూపొందుతున్నదని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: వంశీ పచ్చిపులుసు, సంగీతం: ఈశ్వర్‌చంద్.

# అభిమానులు గర్వపడే సినిమా



"మాఇంటి బంగారం కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. ఇందులో యాక్షన్, డ్రామా, కామెడీ.. ఇలా అన్ని ఎమోషన్సూ ఉంటాయి. డైరెక్టర్ నందినీరెడ్డి, మా రాజ్ నిడిమోరు ప్రతి విషయంలోనూ పర్‌ఫెక్ట్‌గా ఉంటారు. ఈ సినిమా బాగా రావడానికి వారే కారణం. జూన్ 19న వస్తున్నాం. అభిమానులంతా గర్వపడేలా సినిమా ఉంటుంది. చూసి ఎంజాయ్ చేయండి' అని అగ్ర నటి సమంత అన్నారు. ఆమె ప్రధాన పాత్రలో రూపొందిన లేడీ ఓరియెంటెడ్ ఫ్యామిలీ యాక్షన్ థ్రిల్లర్ 'మా ఇంటి బంగారం'. నందినీరెడ్డి దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని రాజ్ నిడిమోరు, హిమాంక్ దువ్వూరుతో కలిసి సమంత నిర్మించింది. సోమవారం హైదరాబాద్‌లో ఈ సినిమా ట్రైలర్ విడుదల కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సమంత మాట్లాడారు. 'సమంత దినదినాభివృద్ధి చెందుతున్నారు. ఈమె ఒకప్పటి సమంత కాదు. ఇప్పుడు తను నెక్స్ట్ లెవల్. ఈ సినిమాలోని ప్రతి సీన్‌లో అదరగొట్టేశారు. నేనూ సమంత అభిమానినే. మానిటర్ ముందు కూర్చొని చూశా. బ్లాక్‌బస్టర్ పక్కా' అని డైరెక్టర్ నందినీరెడ్డి నమ్మకంగా చెప్పారు. "మా ఇంటి బంగారం' అనే పేరులోనే ఎఫెక్షన్, లవ్ ఉంది. అలాగే దాని వెనుక డార్క్‌సైడ్, పొసెసివ్ నెస్ కూడా ఉంటుంది' అని రాజ్ నిడిమోరు అన్నారు. ఇంకా హిమాంక్ దువ్వూరు, శ్రీముఖి, శ్రీనివాస్ గవిరెడ్డి కూడా మాట్లాడారు.

## అందరికీ ఆమోదయోగ్యమైన

# నిర్ణయం తీసుకోవాలి




పర్సంటేజీ విధానం అమలుపై తుది నిర్ణయం తీసుకోవాలని, జూన్ 4న విడుదల కాబోతున్న 'పెద్ది' చిత్రానికి పర్సంటేజీని ఇవ్వాలని తెలంగాణ డిస్ట్రిబ్యూటర్లు ఇటీవల నిర్మాతల గిల్డ్‌ను డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. ఈ సమస్యను పరిష్కరించేందుకు తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఓ కమిటీని కూడా నియమించింది. రెండు నెలల్లోనే నివేదిక అందించేలా కమిటీకి కాలపరిమితిని విధించారు. ఇండస్ట్రీలో నెలకొన్న ఈ ప్రతిష్టంభన నేపథ్యంలో సోమవారం అగ్ర కథానాయకుడు చిరంజీవిని తెలంగాణ డిస్ట్రిబ్యూటర్లతో పాటు నిర్మాతలు దిల్‌రాజు, సురేష్‌బాబు, కె.ఎల్.నారాయణ, అల్లు అరవింద్ తదితరులు కలిసి చర్చలు జరిపారు. దాదాపు గంటకుపైగా సాగిన ఈ చర్చల్లో పర్సంటేజీ విధానంతో పాటు ఇండస్ట్రీలోని పలు సమస్యలను చిరంజీవి దృష్టికి తీసుకొచ్చారు.

ఈ సందర్భంగా మాట్లాడిన చిరంజీవి.. ఇది ఒక్క సినిమా గురించో, ఒక్క సెక్టార్ గురించో చర్చ కాదని, రాబోవు చిత్రాలకు ఇబ్బంది లేకుండా అందరికి అమోదయోగ్యమైన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. గతంలో వేసిన కమిటీలు, వాటి పనితీరు పట్ల డిస్ట్రిబ్యూటర్లలో కొంత అసంతృప్తి ఉందన్న విషయాన్ని తాను అర్థం చేసుకున్నానని చిరంజీవి అన్నారు. ప్రస్తుతం ఏర్పాటు చేసిన కమిటీ జూన్ 30వ తేదీలోగాపర్సంటేజీ విధానం మీద ఓ ప్రతిపాదన తీసుకొస్తుందనే నమ్మకం తనకు ఉందన్నారు. దిల్‌రాజు మాట్లాడుతూ 'ఎగ్జిబిటర్ల సమస్యల్ని చిరంజీవిగారు సానుకూలంగా విన్నారు. ఛాంబర్ ఏర్పాటు చేసిన కమిటీ నుంచి మరిన్ని వివరాలను తెప్పించుకొని పరిశీలిస్తానని చెప్పారు. రెండు రోజుల్లో ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుంది. ఈ వివరాలను ఛాంబర్ అధికారికంగా ప్రకటిస్తుంది' అని దిల్‌రాజు అన్నారు.

# 'పెద్ది'తో రామ్‌చరణ్‌కి నేషనల్ అవార్డు ఖాయం

'పెద్ది' గొప్ప కథ. ఇలాంటి మంచి సినిమాలో భాగమైనందుకు ఆనందంగా ఉంది. నటుడిగా నాకెంతో సంతృప్తినిచ్చిన సినిమా 'పెద్ది'. ఇందులో నా పాత్ర పేరు 'గౌర్నాయుడు'. ఆ పాత్రకు ఓ ఉద్దేశం ఉంటుంది. ఇందులో పెద్ది, గౌర్నాయుడు మధ్య అనుబంధం ఆసక్తికరంగా ఉంటుంది. వారిద్దరి మధ్య ప్రేమ, ఆప్యాయత, ఎమోషన్ ప్రేక్షకులకు కనెక్ట్ అవుతుంది. ఈ కథలో 'పెద్ది' ప్రయాణం అద్భుతం. నా పాత్ర తనకు కోచ్‌లా ఉంటుంది.'పెద్ది'తో రామ్‌చరణ్ నేషనల్ అవార్డ్ అందుకుంటాడని నా నమ్మకం. ఈ సినిమాలో ఆయన పర్‌ఫార్మెన్స్, బాడీ ట్రాన్స్‌ఫర్మేషన్ అద్భుతం. కష్టపడి, ఏకాగ్రతతో, దాదాపు రెండేళ్ల పాటు ఆ పాత్ర కోసం పూర్తిగా ఒదిగిపోయి అంకితభావంతో పనిచేశాడు రామ్‌చరణ్. ఆయన పాత్రతో పాటు నా పాత్ర, జగపతిబాబు పాత్ర, అలాగే మిగతా పాత్రలన్నింటినీ బుచ్చిబాబు గొప్పగా డిజైన్ చేశాడు. రత్నవేల్ ఇచ్చిన విజువల్స్ అయితే మెస్మరైజ్ చేస్తాయి.బుచ్చిబాబు ఫెంటాస్టిక్ డైరెక్టర్. ఆయన మేకింగ్, టేకింగ్ సూపర్. కథకు ఏం అవసరమో అదే తీశారు. ఆయన స్టోరీ టెల్లింగ్ అద్భుతం. ఈ కథలో పలు క్రీడలుంటాయి. ప్రతి క్రీడా కథతో బలంగా అనుసంధానమై ఉంటుంది. ముఖ్యంగాౖక్లైమాక్స్ ఉత్కంఠకు గురిచేస్తుంది. ఆ ఎమోషన్‌ని బిగ్ స్క్రీన్‌పై ఆడియన్స్ బాగా ఎంజాయ్ చేస్తారు. నిర్మాత వెంకట సతీశ్ కిలారు ఏ విషయంలోనూ రాజీపడలేదు. ప్రస్తుతం 'గుమ్మడి నరసయ్య', 'జైలర్ 2' సినిమాలు చేస్తున్నాను. మంచి కథలు వస్తే తెలుగులో సినిమాలు చేస్తాను.



# ఉప్పల్ భగాయత్‌లో అక్రమ షెడ్ల దందా

- లక్షల్లో వసూళ్లు అధికారుల మౌనం, నాయకుల బ్రోకరేజ్ ఆరోపణలు
- బ్రోకర్లుగా మారి అడ్డుకుంటున్న కొందరు రాజకీయ నాయకులు
- భారీగా లంచాలు తీసుకొని కనీసం నోటీసులు కూడా
  ఇవ్వని టౌన్ ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్, ఏసిపి
- అధికారుల అవినీతికి అంతం లేకపోవడంతో దివాలా తీస్తున్న మున్సిపల్ శాఖ
- మున్సిపల్ శాఖ అవినీతి అక్రమాలపై దృష్టి పెట్టని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి





ఉప్పల్ (ప్రశ్న న్యూస్) ఉప్పల్ సర్కిల్ అంటేనే అవినీతి అక్రమాలకు కేంద్రంగా మారింది. అధికారుల లంచాల దాహానికి ఎటుచూసినా అవినీతి, అక్రమాలు జోరుగా జరుగుతున్నాయని ఇందులో కొంతమంది రాజకీయ నాయకులు బ్రోకర్లుగా వ్యవహరిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్న పట్టించుకునే దిక్కు లేకుండా పోయింది.

ఉప్పల్ భగవత్ పరిధిలో అక్రమ షెడ్లు, అనుమతులు లేని నిర్మాణాలు రోజురోజుకు పెరుగుతున్నాయని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిహెచ్ఎంసి అనుమతులు లేకుండా భారీ షెడ్లు, గోదాములు, వాణిజ్య నిర్మాణాలు వెలుస్తున్నప్పటికీ టౌన్ ప్లానింగ్ అధికారులు లంచాలు తీసుకొని కళ్లుమూసుకుని చూస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మున్సిపల్ నిబంధనలు పేదలకు మాత్రమేనా.? డబ్బులు ఇచ్చేవారికి చట్టాలు వర్తించవా.? అంటూ ప్రజలు మండిపడుతున్నారు.

### ఒక్కో షెడ్డు నుంచి లక్షల్లో వసూళ్లు.?

అక్రమ నిర్మాణాలకు సంబంధించిన వ్యవహారాల్లో కొంతమంది టౌన్ ప్లానింగ్ అధికారులు భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఒక్కో అక్రమ షెడ్డు నుంచి లక్షల రూపాయలు తీసుకుంటూ మేమున్నాం, ఎలాంటి ఇబ్బంది రాదు అంటూ హామీలు ఇస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ఫిర్యాదులు వచ్చినా కూల్చివేతలు లేకుండా కేవలం సెటిల్మెంట్లతో వ్యవహారం ముగుస్తోందని ప్రజలు అంటున్నారు.

### రాజకీయ నాయకుల బ్రోకరేజ్ వ్యవహారం.?

కొంతమంది స్థానిక రాజకీయ నాయకులు, వారి అనుచరులు బ్రోకర్లుగా మారి అక్రమ నిర్మాణాలకు అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. "ఇంత మొత్తం ఇవ్వండి, అధికారులు, నాయకులు అందరం చూసుకుంటాం" అంటూ అక్రమ నిర్మాణదారులతో ఒప్పందాలు కుదురుస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ప్రముఖ నాయకుల, ప్రజా ప్రతినిధుల పేర్లు చెప్పుకుంటూ అక్రమార్కులు ఫిర్యాదుదారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### జిహెచ్ఎంసి ఆదాయానికి భారీ గండి



అసలే జిహెచ్ఎంసి అప్పుల్లో మునిగిపోతుంటే అక్రమ నిర్మాణాలు మాత్రం ఆకాశాన్ని అంటుతున్నాయి అధికారులు లంచాలు తీసుకొని కోట్లు గడిస్తూ జిహెచ్ఎంసి ఆదాయానికే దర్జాగా గండి కొడుతుంటే ఇటు జోనల్ కమిషనర్, ఎం ఎం సి కమిషనర్ పట్టించుకోకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తుంది. మున్సిపల్ శాఖ నష్టాలలో ఉన్న కమిషనర్లు నిమ్మకు నేరని తిన్నట్లు వ్యవహరిస్తే పరిస్థితి ఎలా చక్కబడుతుందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు సాగడం వల్ల జిహెచ్ఎంసికి రావాల్సిన ఫీజులు, పన్నులు ప్రభుత్వ ఖజానాకు చేరకుండా కొందరి అవినీతి అధికారుల జేబుల్లోకి వెళ్తున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మున్సిపల్ నిబంధనల ప్రకారం అనుమతులు తీసుకుంటే లక్షల్లో, కోట్లలో ఆదాయం వచ్చే అవకాశం ఉన్నప్పటికీ అవినీతి కారణంగా ఆ మొత్తాలు అక్రమ మార్గాల్లో మాయం అవుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### ఉప్పల్ సర్కిల్‌కు నిబంధనలు వర్తించవా.?

జిహెచ్ఎంసి ఇతర ప్రాంతాల్లో చిన్నచిన్న నిర్మాణాలపైనా నోటీసులు జారీ చేస్తూ కూల్చివేతలు చేపడుతుంటే ఉప్పల్



సర్కిల్‌లో మాత్రం భారీ అక్రమ షెడ్లు, నిర్మాణాలు అవుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. "సాధారణ ప్రజలు చిన్న మార్పు చేసినా వెంటనే నోటీసులు ఇచ్చి కూల్చివేతాలు చేస్తారు కానీ పెద్ద అక్రమ నిర్మాణాలపై, షెడ్ల పై ఎందుకు మౌనం.? అని స్థానికులు నిలదీస్తున్నారు.

### ఫిర్యాదులు చేసినా స్పందన శూన్యం




ఉప్పల్ సర్కిల్ పరిధిలో అధికారులను అవినీతి ఎంత తీవ్రస్థాయికి చేరిందంటే సాక్షాత్ డిప్యూటీ కమిషనర్‌కు, టౌన్ ప్లానింగ్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. పత్రికలో కథనాలు వచ్చిన పట్టించుకోవాలని లంచాలు ఇస్తే చాలు కిందిస్థాయి నుండి ఉన్నత అధికారుల వరకు వాటాలు వెళ్లి కేవలం ఫైళ్లు తిప్పడం, విచారణ పేరుతో కాలయాపన చేయడం తప్ప అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. "ఓన్లీ సెటిల్మెంట్.. నో యాక్షన్" అనే మాటలు ఇప్పుడు ఉప్పల్ భగవత్ ప్రాంతంలో బహిరంగ చర్చగా మారాయని స్థానికులు అంటున్నారు. ప్రభుత్వానికి కోట్ల నష్టం వస్తుందని దానితో ప్రత్యేక దృష్టి సారించాలన్న డిమాండ్ స్థానికుల నుండి పెరుగుతుంది. ఉప్పల్ భగవత్ పరిధిలో సాగుతున్న అక్రమ షెడ్లు, అనుమతి లేని నిర్మాణాలపై ఎం ఎం సి కమిషనర్, ఉప్పల్ జోనల్ కమిషనర్, ఉన్నతాధికారులు వెంటనే విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో జరుగుతున్న అవినీతి, రాజకీయ జోక్యంపై విజిలెన్స్ దర్యాప్తు జరిపి జిహెచ్ఎంసి ఆదాయాన్ని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. "అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపకపోతే ఉప్పల్ ప్రాంతం మొత్తం అవినీతి అడ్డాగా మారిపోతుంది" అని ప్రజలు హెచ్చరిస్తున్నారు.

# రెచ్చిపోతున్న పెట్రోల్ మాఫియా

## -చేతులెత్తేసిన అధికారులు

- ఎక్కడ చూసినా యదేచ్ఛగా దొంగిలించే అడ్డాలు
- సివిల్ సప్లై, పోలీసుల నిర్లక్ష్యం వాళ్లకు వరం
- ఎవరేం చేస్తారంటూ అధికారుల కే సవాల్
- కొంతమంది అధికారుల కనుసైగల్లో నే ఈ దందానా.?
- పోలీసు పెట్రోలింగ్ వాహనాలు పసిగట్ట లేకపోతున్నాయా?
- పెట్రోల్ చోర్ లను పట్టేది లేదు చర్యలు తీసుకునేది లేదు, అంతా మామూళ్ల మాయనా.?

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) అక్రమాలపై ఉక్కు పాదం మోపవలసిన ప్రభుత్వ యంత్రాంగం నిమ్మకు నీవేతనట్లు వ్యవహరిస్తుందా.? లేక అక్రమార్కులకు కొమ్ముకాస్తుందా.? అన్నది ఇప్పుడు చర్చనీ అంశంగా మారింది. ఘట్కేసర్‌లో ఆగని పెట్రోల్ మాఫియా ఆగడాలు రోజురోజుకు పెరుగుతున్నాయనే విమర్శలు స్థానికుల నుండి వెల్లువెత్తుతున్నాయి. పత్రికలో కథనాలు వచ్చిన అధికారులు చర్యలు తీసుకోకుండా బాధ్యత రాహిత్యంగా వ్యవహరించడం పై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఉన్నత అధికారులు కూడా స్పందించకుంటే ఎవరు కట్టడి చేస్తారు అని ప్రశ్నిస్తున్నారు. ఘట్కేసర్, మేడిపల్లి, మల్లాపూర్, చర్లపల్లి పరిసర ప్రాంతాల్లో, ముఖ్యంగా రహదారుల పక్కనే, బహిరంగంగా పెట్రోల్ దొంగతనం జరుగుతుండడం ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. పోలీసులకు, సివిల్ సప్లై అధికారులకు ఏమాత్రం భయపడకుండా మాఫియా గుంపులు తమ దందాను యథేచ్ఛగా కొనసాగిస్తున్నాయి. స్థానికుల ఆరోపణల ప్రకారం కొందరు వ్యక్తులు ప్రత్యేకంగా అడ్డాలుగా ఏర్పడి పెట్రోల్ దొంగిలించి తక్కువ ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రి అని తేడా లేకుండా పగటిపూట కూడా ఈ కార్యకలాపాలు యదేచ్ఛగా జరుగుతున్నాయని ప్రజలు చెబుతున్నారు. ఇంత బహిరంగంగా దొంగతనం జరుగుతున్నప్పటికీ, సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ట్యాంకర్లకు జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థ ఉన్నప్పటికీ పెట్రోల్ చోరీ ఎలా జరుగుతున్నాయన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ట్యాంకర్ల కదలికలను ట్రాక్ చేయడానికి ఉన్న సాంకేతిక పరిజ్ఞానం ఉన్నా యదేచ్ఛగా దొంగిలిస్తుంటే పెట్రోల్ కార్పొరేషన్ అధికారులు ఎందుకు మౌనంగా ఉంటున్నారు ఇందులో వాళ్లకు కూడా వాటాలు ఉన్నాయా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నారు. ఇందులో పెట్రోల్ సంస్థల అధికారుల హస్తం ఉందా అన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పెట్రోల్ సంస్థల నిబంధనలు కేవలం పేపర్‌పైనే ఉన్నాయా.? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇక సివిల్ సప్లై, పోలీసుల నిర్లక్ష్యం ఈ మాఫియాకు మరింత బలాన్ని ఇస్తోందని స్థానికులు మండిపడుతున్నారు. పెట్రోల్ వ్యవస్థలో లోపాలు, అధికారుల పర్యవేక్షణ లోపం, కొందరు అధికారుల అవినీతి కారణంగా ఈ దందా రోజురోజుకు విస్తరిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.




### అధికారుల బాధ్యతారాహిత్యమే పరిస్థితి కారణమా.?

ప్రభుత్వ చట్టాలను అమలు చేయాల్సిన వారే కళ్లుమూసుకుని ఉంటే, మాఫియా గుంపులు మరింత దూకుడుగా వ్యవహరించడం సహజమేనని అంటున్నారు. రహదారుల పక్కనే పెట్రోల్ దొంగతనం జరుగుతుండటం చూస్తుంటే నిఘా ఎంత నిర్లక్ష్య పరిస్థితుల్లో ఎంత దారుణంగా ఉందో స్పష్టంగా అర్థమవుతుంది. ప్రజల కళ్లముందే జరుగుతున్న ఈ అక్రమ కార్యకలాపాలపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అధికార యంత్రాంగంపై ప్రజల నమ్మకాన్ని దెబ్బతీస్తోంది. ఇది కేవలం ఆర్థిక దోపిడీ మాత్రమే కాకుండా ప్రజల భద్రతా పరమైన ప్రమాదాలను కూడా కలిగించే అంశం. పెట్రోల్ అగ్ని ప్రమాదాలకు గురయ్యే పదార్థాలను అనధికారికంగా నిల్వ చేయడం, దొంగిలించడం, విక్రయించడం వల్ల ఎప్పుడు ప్రమాదం సంభవిస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. అయినప్పటికీ అధికారులు స్పందించకపోవడం మరింత ఆందోళన కలిగిస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే దాని బాధ్యత ఎవరు వహిస్తారు అనే ప్రశ్నలు ప్రజలలో వ్యక్తమవుతున్నాయి. అవినీతి, అక్రమాలను అరికట్టాల్సిన సివిల్ సప్లై, పోలీస్ శాఖలు వాటినే పెంచి పోషిస్తున్నాయనే విమర్శలు గట్టిగా వినిపిస్తున్నాయి. కొందరు అధికారులు మాఫియాతో కుమ్మక్కై ఉండవచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. లేకపోతే ఇంత బహిరంగంగా జరుగుతున్న దందా ఇప్పటివరకు ఎలా కొనసాగుతోందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సివిల్ సప్లై, పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. పెట్రోల్ మాఫియాపై ప్రత్యేక దృష్టి సారించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఘట్కేసర్, మేడిపల్లి, చర్లపల్లి, మల్లాపూర్ పెట్రోల్ మాఫియా దందాను పూర్తిగా అరికట్టాలంటే అధికారులు కఠినమైన చర్యలు తీసుకోవడం తప్ప మరో మార్గం లేదు. అధికారులు తమ బాధ్యతను గుర్తించి తక్షణమే స్పందిస్తేనే పరిస్థితి అదుపులోకి వచ్చే అవకాశం ఉంది. లేదంటే ఈ మాఫియా మరింత విస్తరించి ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారే ప్రమాదం ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

# మా కుమార్తె కేసులో న్యాయం చేయండి

## - జగన్‌ను వేడుకున్న సుగాలి ప్రీతి తల్లిదండ్రులు!



అమరావతి (ప్రశ్న న్యూస్) గత తొమ్మిదేళ్లుగా తమ కుమార్తె కేసులో న్యాయం కోసం పోరాడుతున్న సుగాలి ప్రీతి తల్లిదండ్రులు పార్వతి, రాజు నాయక్‌లు వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ ను కలిసి తమ ఆవేదనను పంచుకున్నారు. 2017లో తమ కుమార్తెపై అత్యంత దారుణంగా అత్యాచారం చేసి, హత్య చేశారని.. ఇన్నేళ్లు గడుస్తున్నా తమకు ఇంకా న్యాయం జరగలేదని వారు జగన్ ఎదుట కన్నీరు పెట్టుకున్నారు. ఆనాడు వైసీపీ ప్రభుత్వం తమ కుటుంబానికి కర్నూలులో 5 సెంట్ల ఇంటి స్థలం, 5 ఎకరాల వ్యవసాయ భూమితో పాటు ప్రీతి తండ్రికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి అండగా నిలిచిందని చెప్పారు. అయితే, ప్రస్తుతం ఈ కేసును పూర్తిగా పక్కనపెట్టేశారని ఆరోపించారు. అంతేకాకుండా, తమకు రావాల్సిన పెన్షన్‌ను కూడా స్థానిక అధికారులు నిలిపివేశారని, కేటాయించిన స్థలంలో ఇల్లు నిర్మించుకునేందుకు సాయం అడిగినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని జగన్ దృష్టికి తీసుకెళ్లారు. సీబీఐ విచారణ వేగవంతమయ్యేలా తమకు న్యాయ సహాయం అందించాలని వారు కోరారు. బాధిత తల్లిదండ్రుల గోడును సావధానంగా విన్న జగన్, సుగాలి ప్రీతి కుటుంబానికి అన్ని విధాలా న్యాయ సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. పార్టీ తరపున లీగల్ సపోర్ట్ ఇస్తామని, భవిష్యత్తులోనూ ఆ కుటుంబానికి వైసీపీ అండగా ఉంటుందని జగన్ భరోసా కల్పించారు.

# నాకు ఏపీ పోలీసుల నుంచి ఎలాంటి నోటీసులు రాలేదు

## - తెలంగాణ డీజీపీ సి.వి. ఆనంద్‌ను కలిసిన ప్రొఫెసర్ నాగేశ్వర్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ మంగళవారం తెలంగాణ డీజీపీ సి.వి. ఆనంద్‌తో సమావేశమయ్యారు. ఈ భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, తనకు ఆంధ్రప్రదేశ్ పోలీసుల నుంచి ఎలాంటి నోటీసులు అందలేదని స్పష్టం చేశారు. తనపై సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారం, తప్పుడు సమాచారంపై చర్యలు తీసుకోవాలని డీజీపీని కోరినట్లు ఆయన వివరించారు. ఇటీవల ఒక టీవీ చర్చా కార్యక్రమంలో పవన్ కల్యాణ్, అమిత్ షా, వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి సంబంధించి నాగేశ్వర్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదమైన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలను తాను ఇప్పటికే ఉపసంహరించుకున్నట్లు ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో జనసేన నాయకుల ఫిర్యాదులతో కాకినాడ, మచిలీపట్నం వంటి ప్రాంతాల్లో ఆయనపై పలు ఎఫ్‌ఐఆర్‌లు నమోదయ్యాయి. ఈ క్రమంలో నాగేశ్వర్‌ను అరెస్ట్ చేసేందుకు ఏపీ పోలీసులు హైదరాబాద్ వెళ్లారంటూ సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరిగింది. అయితే, ఈ వార్తలను ఏపీ ప్రభుత్వం అప్పుడే ఖండించింది. తాజాగా ప్రొఫెసర్ నాగేశ్వర్ స్వయంగా తనకు నోటీసులు రాలేదని చెప్పడంతో ఈ వదంతులకు తెరపడినట్లయింది.

# ఆర్టీసీ డ్రైవర్‌పై వేటు వెనక్కి

## - విధుల్లో కొనసాగించాలని మంత్రి పొన్నం ఆదేశం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కాంగ్రెస్ నేతల నిరసనపై విమర్శలు చేశాడన్న ఆరోపణలతో ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్‌ను తొలగించడంపై చెలరేగిన వివాదానికి తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెరదించారు. డ్రైవర్ అశోక్‌పై తీసుకున్న చర్యను వెనక్కి తీసుకోవాలని, అతడిని విధుల్లో కొనసాగించాలని యాజమాన్యానికి సూచించినట్టు ఆయన మంగళవారం తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ "డ్రైవర్ అశోక్ ఆర్టీసీ ఉద్యోగి కాదు, కేవలం అద్దె బస్సు డ్రైవర్ మాత్రమే. అయినప్పటికీ, అతను రైతుల పక్షాన మాట్లాడాడు. దానిని మేము స్వాగతిస్తున్నాం. అందుకే అతడిని ఉద్యోగం నుంచి తొలగించవద్దని బస్సు యాజమాన్యానికి సూచించాం" అని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు విషయంలో కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా, రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకోవడానికి అన్ని చర్యలు తీసుకుంటోందని, ఈ విషయాన్ని విపక్షాలు రాజకీయం చేయవద్దని హితవు పలికారు.

### అసలేం జరిగిందంటే..

సోమవారం జగిత్యాల నుంచి ధర్మపురికి బస్సు నడుపుతున్న సమయంలో, పెట్రోల్, డీజిల్ ధరల పెంపును నిరసిస్తూ కాంగ్రెస్ నేతలు, మంత్రి ఆడ్లూరి లక్ష్మణ్ చేపట్టిన ధర్నాపై డ్రైవర్ అశోక్ స్పందించారు. నిరసనల కన్నా రైతుల నుంచి మొక్కజొన్న, పత్తి వంటి పంటలను కొనుగోలు చేయడంపై దృష్టి పెట్టాలని ఆయన సూచించినట్టు తెలిసింది. ఈ వ్యాఖ్యలపై స్థానిక కాంగ్రెస్ నేత ఒకరు ఫిర్యాదు చేయడంతో, డ్రైవర్‌ను తక్షణమే విధుల నుంచి తప్పించాలని బస్సు యజమానికి జగిత్యాల డిపో మేనేజర్ లేఖ రాశారు. ఈ ఘటనపై బీఆర్ఎస్ నేతలు హరీశ్ రావు, కవిత తీవ్రంగా స్పందించారు. ప్రశ్నించిన వారి ఉద్యోగాలు తీసేయడం అప్రజాస్వామికమని విమర్శించారు. బీఆర్ఎస్ నేతలు గంగుల కమలాకర్, జీవన్ రెడ్డి ఆర్టీసీ రీజనల్ మేనేజర్‌ను కలిసి అశోక్‌ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విపక్షాల నుంచి తీవ్ర విమర్శలు రావడంతో ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588